
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 6 అక్టోబరు 2024



మిస్టరీగా సీఐ తల్లి మిస్సింగ్ కేసు

- పూజ కోసం వెళ్లి అంతుచిక్కని వైనం
- వారం రోజులుగా మదనపల్లెలో చర్చ
- ప్రైవేటు ఫైనాన్స్‌లో బాధితురాలి నగలు..?



సీఐ తల్లి స్వర్ణకుమారి (ఫైల్)

మదనపల్లె టౌన్, అక్టోబరు 5: ఆమె ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తల్లి. సరిగ్గా వారం రోజుల క్రితం కనపడకుండాపోయింది. ఇంటి ముందు తెలిసిన యువకుడు పూజకు తీసుకెళ్తానని చెప్పి వృద్ధురాలిని తీసుకెళ్లగా, ఆమె ఇంటికి తిరిగి రాకపోగా ఆమె ధరించిన బంగారు నగలు ఓ ఫైనాన్స్ సంస్థలో కుదువ పెట్టడం, అనుమానితుడి ఇంటిలో రూ.లక్ష వరకు నగదు బయటపడం చూస్తుంటే వృద్ధురాలి మిస్సింగ్ కేసు మిస్టరీగా మారుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు... మదనపల్లెకు చెందిన నాగేంద్రప్రసాద్ ధర్మవరం వన్‌టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య, పిల్లలు ధర్మవరంలోనే కాపురం ఉన్నారు. కాగా నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి (65) మదనపల్లె పట్టణ శివారులోని జగన్ కాలనీలో నివాసం ఉంటోంది. స్వతహాగా ఎవరి మీద ఆధారపడకుండా ఒంటరిగానే స్వర్ణకుమారి జీవనం సాగిస్తోంది. ఆమెకు భక్తి ఎక్కువ. ఈ క్రమంలో గత శనివారం ఉదయం ఆమె ఇంటి ముందు నివాసమున్న వెంకటేశ్ అనే యువకుడు వచ్చి స్వర్ణకుమారిని పూజకు తీసుకెళ్తానని చెప్పి ఎక్కడికో తీసుకెళ్లాడు. మధ్యాహ్నం 11 గంటలకు ఆమె స్నేహితురాలు ఫోన్ చేయగా కాల్ ఫార్వర్డ్ వాయిస్ వినిపించినట్లు తెలిసింది. సాయంత్రం అయినా స్వర్ణకుమారి ఇంటికి తిరిగి రాలేదు. ఎక్కడికో పూజకు వెళ్లి ఉంటుందని అందరూ అనుకున్నారు. ఈ క్రమంలో 1వ తేదీ పింఛన్ తీసుకోవడానికి కూడా స్వర్ణకుమారి రాకపోవడంతో అందరికీ అనుమానం బలపడింది. దీంతో విషయాన్ని కుమారుడు నాగేంద్రప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన మదనపల్లె తాలూకా పోలీసులకు తన తల్లి కనపడటం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితురాలి నగలు ప్రైవేట్ ఫైనాన్స్ దుకాణంలో ప్రత్యక్షం..!

స్వర్ణకుమారి ఒంటిపై ఉండాల్సిన నగలు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారని సమాచారం. శనివారం సాయంత్రమే రూ.4.50 లక్షలకు ఈ నగలు కుదువ పెట్టినట్లు వివరాలు తెలుసుకుంటున్నారు. దీంతో పాటు అనుమానితుడు వెంకటేశ్ ఆది, సోమవారాలు ఇంటి వద్దనే ఉన్నట్లు, అతడి ఆచూకీ కోసం పోలీసులు వెతుకుతుండగా పారిపోయాడని తెలిసింది. కాగా వెంకటేశ్ తన మొబైల్‌ఫోను స్విచ్ ఆఫ్ చేయడమే కాక సిమ్‌ను తీసి ఇంట్లోనే పడేసి వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో అతడిని వెతికిపట్టుకునేందుకు పోలీసులు నానా ప్రయాస పడాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే వెంకటేశ్‌కు మదనపల్లె పట్టణానికి చెందిన ఓ యువకుడు సహకరించినట్లు సమాచారం. దీంతో వీరిద్దరి కదలికలపై పోలీసులు నిఘా పెట్టి గాలిస్తున్నారు. ఇదిలా వుంటే బాధితురాలు స్వర్ణకుమారి మొబైల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉండటం, టవర్ లోకేషన్ ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో చూపిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పోలీసులు ఈ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఒక సీఐ స్థాయి అధికారి తల్లి మిస్సింగ్ అయిందంటే, అది కూడా వారం దాటుతుంటే దీని వెనుక ఏమి ఉంటుందనేది పట్టణ ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

రెండు ప్రత్యేక బృందాలతో గాలింపు..

స్వర్ణకుమారి మిస్సింగ్ కేసును రెండు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చేయిస్తున్నాం. సాంకేతిక సహాయంతో పాటు ఆమె ఎక్కడెక్కడ ఉందో పరిశీలిస్తున్నాం. కర్ణాటక రాష్ట్రంలో ఉన్నట్లు కొంత సమాచారం వచ్చిందని, దీనిపై బెంగళూరుకు రెండు టీముల పోలీసులను పంపాము. వీలైనంత తొందరగా ఈ కేసు ఛేదిస్తాం.

- కొండయ్యనాయుడు, డీఎస్పీ, మదనపల్లె

అన్నపూర్ణా.. నమోస్తుతే..

రాయచోటి టౌన్, అక్టోబరు 5: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాయచోటిలోని భద్రకాళీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణాదేవి.. ఆకలి తీర్చి ఆదుకోవమ్మా.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. పీలేరులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు శనివారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. మదనపల్లెలో కోర్టులో వెలసిన గంగమ్మకు పసుపు అలంకరణ చేశారు. వాసవీ కన్యాకాపరమేశ్వరీ దేవిని అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకరణతో విశేషంగా పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాజంపేట మన్నూరు ఉదయగిరి యల్లమ్మ తల్లి చంద్రఘంట అలంకారంలో, రాజంపేట అమ్మవారిశాలలో అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం నిర్వహించారు.



రాయచోటి వీరభద్రాలయంలో..



గాయత్రీదేవి అలంకారంలో గుర్రంకొండ రెడ్డెమ్మతల్లి



కలికిరిలో అన్నపూర్ణదేవి అలంకారం



రాజంపేటలో అన్నపూర్ణాదేవి అలంకారం



పీలేరులో అన్నపూర్ణాదేవి అలంకారం

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

గుర్రంకొండ, అక్టోబరు 5: తరిగొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని టీటీడీ వేదపండితులు శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి వేదపండితులు కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కొబ్బరి కాయలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, అనిల్, గోకుల్, వెంకీ, వరద, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దరఖాస్తుదారులకు కష్టాలు

- రూ.2 లక్షల డీడీలకు జెన్యునెస్ సర్టిఫికెట్ ఇవ్వని బ్యాంకులు
- టెన్షన్ పడుతున్న మద్యం దుకాణాల దరఖాస్తుదారులు
- కలెక్టర్‌కు సమస్య వివరించిన ఎక్సైజ్ ఈఎస్

మదనపల్లె టౌన్, అక్టోబరు 5: ప్రైవేటు మద్యం దుకాణం దక్కించుకుందామని ఎంతో ఆశగా బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షల దరఖాస్తు డీడీలు తీసుకున్న వ్యాపారులకు సినిమా కష్టాలు మొదలయ్యాయి. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు నింపి వాటికి రూ.2 లక్షల డీడీలను జత చేసి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు ఇస్తుంటే ఈ డీడీలకు జెన్యునెస్ (ఒరిజినల్) సర్టిఫికెట్ కావాలని సీఐలు అడుగుతుంటే దరఖాస్తుదారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌లలో ఈ సమస్య తలెత్తడంతో విషయం తెలుసుకున్న ఎక్సైజ్ ఈఎస్ మధుసూదనరావు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో 111 ప్రైవేటు మద్యం దుకాణాలకు ఐదు రోజుల కిందట ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తు రుసుం రూ.2 లక్షలను బ్యాంకులో చెల్లించి ఎక్సైజ్ ఈఎస్ పేరిట డీడీ తీసుకుని దరఖాస్తుకు జతపరచాలి. ఇక్కడే అసలు సమస్య వచ్చి పడింది. గతంలో చిత్తూరు జిల్లా కేంద్రంలో జరిగిన మద్యం దుకాణం బహిరంగ టెండర్ల సమయంలో కొంతమంది దరఖాస్తు రుసుం డీడీలను కలర్ జిరాక్స్ తీసి దరఖాస్తులకు జత చేయడం, ఒరిజినల్ డీడీలను అలాగే పెట్టుకోవడం బయటపడింది. అప్పట్లో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎక్సైజ్ శాఖాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు కూడా దరఖాస్తుదారులు రూ.2 లక్షల డీడీలను ఎక్కడ కలర్ జిరాక్స్‌లు తీసి పెడుతున్నారో అన్న అనుమానం ఎక్సైజ్ శాఖ అధికారుల్లో మెదులుతోంది. దీంతో ఎక్కడైతే డీడీలు తీశారో ఆ బ్యాంకుల నుంచి డీడీ జెన్యునెస్ (ఒరిజినల్) సర్టిఫికెట్ తీసుకురావాలని సీఐలు చెబుతున్నారు. కాగా స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి వచ్చిన అధికారులు కేవలం ఎస్‌బీఐ డీడీలకు మాత్రమే జెన్యునెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. మిగిలిన బ్యాంకుల నుంచి తీసుకున్న డీడీల సంగతి తమకు తెలియదని చేతులెత్తేశారు. దీంతో దరఖాస్తుదారులకు టెన్షన్ మొదలైంది. జిల్లాలో ఇప్పటి వరకు 480 మందికిపైగా దరఖాస్తుదారులు ఈ సమస్య ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎనిమిది మంది సీఐలు జిల్లా ఎక్సైజ్ ఈఎస్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా వుండగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో రూ.2 లక్షలు చెల్లిస్తున్న వారికి ఈ సమస్య ఎదురు కాలేదు. దీంతో వారు నింపాదిగా ఉన్నారు.

ఎల్‌డీఎంతో చర్చించి సమస్య పరిష్కరిస్తాం..

జిల్లా నలుమూలల నుంచి డీడీల జెన్యునెస్ సర్టిఫికెట్ల విషయమై సమస్యలు వస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయమై కలెక్టర్ చామకూరి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లాము. దీనిపై లీడ్ బ్యాంకు మేనేజర్ (ఎల్‌డీఎం)తో చర్చించి సోమవారం నుంచి ఈ సమస్య లేకుండా చర్యలు చేపడతాము.

- మధుసూదనరావు, ఎక్సైజ్‌శాఖ సూపరింటెంటెండ్, రాయచోటి

ఏపీఐఐసీ-1 లేఔట్‌లో నీటి సౌకర్యం పునరుద్ధరణ



ట్యాంకును పరిశీలిస్తున్న ఏఈ ఇరగన్న

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీలేరు, అక్టోబరు 5: పీలేరు పట్టణానికి చెందిన ఏపీఐఐసీ-1 లేఔట్‌ను శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న పరిశీలించారు. పాడైపోయిన రెండు బోర్ల స్టార్టర్లకు మరమ్మతులు చేసి లేఔట్‌లో నీటి వసతిని పునరుద్ధరించారు. జగనన్న కాలనీల్లోని అసౌకర్యాలపై ఆంధ్రజ్యోతి శనివారం 'అధ్వాన్నం, సాగేదెలా నిర్మాణం' పేరిట వచ్చిన కథనంలో ఏపీఐఐసీ-1 లేఔట్‌లోని మూడు బోర్లు పాడైపోయాయని రావడంతో దీంతో ఏఈ ఇరగన్న తమ బృందంతో ఆ లేఔట్‌ను సందర్శించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేశారు. రెండు బోర్ల స్టార్టర్లు పాడైపోయి ఉండడంతో వాటి స్థానంలో కొత్తవి అమర్చి నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. మరో బోరులో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు వేసి ఉండడం, దానికోసం ప్రత్యేక వాహనం కావాల్సి రావడంతో దానిని పెండింగ్‌లో పెట్టారు. అందుబాటులోకి వచ్చిన రెండు బోర్ల ద్వారా నీటిని పంపింగ్ చేసి లేఔట్‌లోని వివిధ ప్రాంతాల్లో అమర్చిన సింటెక్స్ ట్యాంకులకు అందించారు. మూడు నెలల తరువాత తమ కాలనీలో నీటి సౌకర్యం లభించడంతో స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులను దుర్భాషలాడిన టీడీపీ నేత కొండ్రెడ్డి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దారు
- కొండ్రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు





టీడీపీ నేత కొండ్రెడ్డిని ములకలచెరువు సర్కిల్ కార్యాలయానికి తీసుకొచ్చిన పోలీసులు.. పెట్రోల్ బాటిళ్లతో నిరసన తెలుపుతున్న మహిళలు

తంబళ్లపల్లె/ములకలచెరువు, మదనపల్లె అర్బన్, అక్టోబరు 5: తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె భూవివాదంపై రెవెన్యూ అధికారులను దుర్భాషలాడినందుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. తహసీల్దారు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం దిగువపాళ్యం పంచాయతీ అన్నగారిపల్లెలో సర్వే నెంబరు-51లో ఉన్న 45 సెంట్లలో అంగన్వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం, పంచాయతీ కార్యాలయాల పరిసరాలలో ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలాన్ని కొన్నేళ్ల నుంచి గ్రామానికి చెందిన పలువురు ఆక్రమించుకుని గొర్రెల దొడ్లు, ఎరువు దిబ్బలుగా ఉపయోగించుకుంటున్నారు. కాగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కొద్దిరోజుల క్రితం పంచాయతీ అధికారులు, సిబ్బంది గ్రామస్తుల అనుమతితో ఆక్రమణలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం తిరిగి మళ్లీ అదే స్థలంలో ఆక్రమణదారులు యథావిధిగా గొర్రెల దొడ్లు, దిబ్బలను వేయడం ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ స్థలానికి హద్దులను గుర్తిస్తుండగా ఆక్రమణదారులు వారిపై దూషణలకు దిగి పనులు అడ్డుకున్నారు. అదేవిధంగా ఈ విషయాన్ని ఆక్రమణదారులు టీడీపీ నేత కొండ్రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం తహసీల్దారు హరికుమార్ సబ్‌కలెక్టరు కార్యాలయంలో విధి నిర్వహణలో ఉండగా టీడీపీ నేత కొండ్రెడ్డి తహసీల్దారుకు ఫోన్ చేసి నానా దుర్భాషలాడాడు. ఈ విషయాన్ని తహసీల్దారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి సూచనల మేరకు కొండ్రెడ్డితో పాటు ఆక్రమణదారులు ఎం.సుబ్బారెడ్డి, ఎం.చలపతినాయుడు, వై.నాగలక్ష్మీ, బి.వెంకట్రమణ నాయక్, కె.మల్లికార్జునలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కొండ్రెడ్డితో సహా ఐదుగురిపై కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం కొండ్రెడ్డి తంబళ్లపల్లెలో స్వగృహంలో ఉండగా అదుపులోకి తీసుకుని మదనపల్లె డీఎస్పీ కార్యాలయానికి తరలించారు.

పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను నుంచి శనివారం మధ్యాహ్నం కొండ్రెడ్డిని ములకలచెరువు సర్కిల్ కార్యాలయానికి తీసుకొచ్చారు. పోలీసుల వాహనాల వెంబడి వచ్చిన ఆయన అనుచరులు, పలువురు టీడీపీ శ్రేణులు కూడా ఇక్కడికి చేరుకున్నారు. దీంతో కొంతసేపు ములకలచెరువు పోలీ స్‌స్టేషన్ వద్ద ఏమి జరుగుతోందోనని స్థానికులు ఆందోళన చెందారు. చివరకు గంట తరువాత ఇక్కడి నుంచి పోలీసులు తిరిగి మదనపల్లెకు తీసుకెళ్లారు. కాగా మదనపల్లె నుంచి ములకలచెరువుకు వచ్చే సమయంలో బత్తలాపురం క్రాస్ వద్ద పోలీసుల వాహనాన్ని కార్యకర్తలు అడ్డుకున్నారు. కొంతసేపు వాహనాలు నిలిపి తిరిగి సర్కిల్ కార్యాలయానికి వచ్చారు.

మదనపల్లెలో టీడీపీ నాయకుల నిరసన

కొండ్రెడ్డి అరెస్టుకు నిరసనగా మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద గంటపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శనివారం ఉదయం తంబళ్లపల్లె పోలీసులు కొండ్రెడ్డిని అరెస్టు చేసి మదనపల్లె టూటౌన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఆయన అనుచరులు, మహిళలు మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు తరలివచ్చి ఆందోళన చేశారు మహిళలు పెట్రోల్ బాటిల్స్‌తో ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. టూటౌన్ సీఐ రామచంద్ర, వన్‌టౌన్ సీఐ చాంద్ బాషా, టూటౌన్ సీఐ రవికుమార్‌లు వారికి సర్దిచెప్పారు. అనంతరం కొండ్రెడ్డిని ములకలచెరువుకు తీసుకెళ్లి తిరిగి మదనపల్లెకు వచ్చి కోర్టులో హాజరుపరచగా సొంత పూచీకత్తుతో ఆయనను సాయంత్రం విడుదల చేశారు.

ఈ-పంట నమోదును పరిశీలించిన కలెక్టర్



రాయచోటి టౌన్, అక్టోబరు 5: రాయచోటి మండలం అబ్బవరం గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ-పంట నమోదు వివరాలను శనివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అబ్బవరం గ్రామానికి చెందిన తరిగొండ శేషాద్రి సాగు చేసిన వేరుశనగ పంట నమోదు వివరాలను పరిశీలించారు. అనంతరం ఈ-పంట నమోదు కార్యక్రమం గురించి ఆ గ్రామానికి చెందిన కొంత మంది రైతులతో మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా ప్రతి రైతు తమ పంటలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రానాయక్‌కు ఈ-పంట కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. పరిశీలనలో జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీలత, ఆ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక రూపొందించండి

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 5: జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు రెండవ వంద రోజుల ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెండవ వందరోజుల ప్రణాళికలో తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికల డాక్యుమెంటరీ సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. జిల్లాలో ఉన్న కీలక రంగాలు, అంశాలపై దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ రూపకల్పన చేసుకుని రానున్న రెండవ వంద రోజులకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజంపేట సబ్‌ట్రెజరీ ఉద్యోగులపై వేటు

'ఖజానాకు కన్నం'పై రాష్ట్ర డైరెక్టర్ సీరియస్

కడప(కలెక్టరేట్) అక్టోబరు5: రాజంపేట సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల అన్నమయ్య జిల్లా, రాజంపేట సబ్ డివిజన్ ట్రెజరీ కార్యాలయంలో స్ట్రాంగ్ రూములో నగదు బంగారు మాయంపై ఖజానాకు కన్నం అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ విషయంపై కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాలో ట్రెజరీ ఉద్యోగుల్లో పెద్ద చర్చ సాగింది. బంగారు, నగదు చోరీకి గురైందనే సమాచారం రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్‌కు చేరడంతో సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే ఏటీఓ అమీనుద్దీన్, సబ్‌ట్రెజరీ అధికారి రమేష్ రెడ్డి, షరాబు మురళీని సస్పెన్షన్ చేస్తూ రాష్ట్ర డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా పాలనా పరమైన ఇబ్బందులు రాకుండా రాజంపేట ఎస్‌టీఓగా వెంకటరెడ్డి, ఏటీఓగా ఖాదర్ వల్లిని నియమించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అటెండర్ విష్ణు వర్ధన్ రెడ్డి కూడా పోలీసులకు సరెండర్ అయినట్లు తెలుస్తోంది.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్ తస్లీమాకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 5: రాష్ట్రంలో ఉపాధ్యాయుల జీవిత బీమా సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఏపీజీఎల్ఐ కార్యాలయంలో సహాయ సంచాలకులకు వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ ఏపీజీఎల్ఐ బాండ్లు గడువు తీరిన ఉపాధ్యాయులకు చివరి మొత్తాలను చెల్లించడంలోనూ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు రుణాలు చెల్లించడంలోనూ ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోందన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన ఉపాధ్యాయులకు రావాల్సిన మొత్తాలను కుటుంబ సభ్యులకు చెల్లించడంలో జాప్యం జరుగతుందన్నారు. వెంటనే వీటిపై సమీక్షించి జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసులరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు 21 మంది ఎంపిక

రైల్వేకోడూరు, (రూరల్) అక్టోబరు 5: అంతర్ జిల్లాల తైక్వాండో పోటీల్లో 21 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి చమర్తి శారద, రాష్ట్ర కోచ్ హస్తి రవిశంకర్‌రాజు తెలిపారు. 11 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో 10 మంది, బాలికల విభాగంలో 11 మంది క్రీడాకారులు డిసెంబరు రెండో వారం మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఫిజికల్ డైరెక్టర్స్ విజయ్ ప్రసాద్‌రెడ్డి, అరుణకుమారీ, సుబ్బరాజు, చంద్రమోహన్‌రాజు, ప్రసాద్‌వర్మ పాల్గొన్నారు.

కోదండరాముడి సేవలో సమాచార శాఖ కమిషనర్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కమిషనర్ సునీల్

ఒంటిమిట్ట, అక్టోబరు 6 : ఒంటిమిట్ట కోదండరాముడిని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్టు సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ విశిష్టత, చరిత్రను తెలుసుకున్నారు. తహసీల్దార్ రమణమ్మ, ఎస్ఐ శివప్రసాద్, టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సేవలో....

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 5: కాలజ్ఞాన కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని శనివారం ఏపీ రాష్ట్ర సమాచార శాఖ కమిషనరు చావలి సునీల్ దర్శించుకున్నారు. దేవస్థాన మేనేజరు ఈశ్వరయ్య ఆచారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కక్కయ్యమఠం సందర్శించారు. పెద్దిరెడ్డి రాం, సతీష్‌కుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, గుర్రంపాటి రమణరెడ్డి, వడ్డెమాను నాగేశ్‌నాయుడు, బి.మఠం డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, సాంబశివారెడ్డి, వీఆర్వో వినయ్, ఏఎస్ఐ గురప్ప, కానిస్టేబుల్ నాగేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిటోనేటర్లు పేల్చి వీఆర్ఏ హత్య

వివాహేతర సంబంధమే కారణం : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల టౌన్, అక్టోబరు 5: కొత్తపల్లి వీఆర్ఏ నరసింహులును డిటోనేటర్లు పేల్చి హత్య చేసినట్లు, ఇందుకు వివాహేతర సంబంధమే కారణమని డీఎస్పీ పి.మురళీనాయక్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వెల్లడించిన వివరాల్లోకెళితే....

వేముల మండలం కొత్తపల్లెలో గత నెల 29న వీఆర్ఏ నరసింహులు, సుబ్బలక్షుమ్మ దంపతులు ఇంటి ఆవరణలోని రేకులషెడ్డులో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి మంచం కింద బ్లాస్టింగ్ మెటీరియల్ ఉపయోగించి పేల్చడంతో నరసింహులు మృతి చెందగా, సుబ్బలక్షుమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదు చేసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఆర్‌కే వ్యాలీ సీఐ నాగరాజు, వేముల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం వేముల మండలం పాతకదిరి రోడ్డులో వాహనాల తనిఖీలో బాబును అదుపులోకి తీసుకుని విచారిస్తే నరసింహులు భార్యతో బాబు వివాహేతర సంబంధం నెరపేవాడు. విషయం తెలుసుకున్న నరసింహులు అతని కుటుంబ సభ్యులు బాబును మందలించారు. దీంతో మంచం కింద జిలెటిన్ స్టిక్స్‌ను బాబు పేల్చడంతో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. బాబును అరెస్టు చేసి, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరులో భారీగా పట్టుబడ్డ గోవా మద్యం

- పోలీసుల దాడులతో బహిర్గతమైన పొరుగుమద్యం దందా



భారీగా పట్టుబడిన గోవా మద్యం

ప్రొద్దుటూరు అక్టోబరు 5: ప్రొద్దుటూరులో పొరుగు మద్యం ఏరులై పారుతోంది. శనివారం వన్‌టౌన్ పోలీసులు జరిపిన దాడుల్లో గోవాకు చెందిన అక్రమ మద్యం భారీఎత్తున పట్టుపడింది. వివరాల్లోకి వెళితే ఎస్పీ ఆదేశాలమేరకు డీఎస్పీ భక్తవత్సలం కు రాబడిన సమాచారం మేరకు శనివారం సాయంత్రం పవర్‌హౌస్ వెనుక వున్న చెంగమాంబ కల్యాణ మండపం ఎదురు గదుల్లో భారీ ఎత్తున మద్యం పట్టుబడింది. వన్‌టౌన్ సీఐరామక్రిష్ణా రెడ్డి వెల్లడించిన వివరాల మేరకు తనతో పాటు ఎస్ఐ సంజీవ రెడ్డి పోలీసు సిబ్బంది కలిసి జరిపిన దాడుల్లో ఖాళీగా వున్న ఆ గదుల్లో 816-750ఎంఎల్ మద్యం బాటిళ్ళు, 10 రెండులీటర్ల బాటిళ్ళు, 500 ఎంఎల్ బీరు బాటిళ్ల 72 అక్రమంగా నిల్వవుంచినట్లు గుర్తించామని తెలిపారు. ఈ గదిని వినాయకనగర్‌కు చెందిన హరి, అమృతనగర్‌కు చెందిన కాటం వీరేంద్ర నెల కిందట అద్దెకు తీసుకుని మద్యం, బీర్ల బాటిళ్లను నిల్వపెట్టినట్లు తెలిసిందన్నారు. ఈ మద్యాన్ని సీజ్‌చేసి వన్‌టౌన్ పోలీసు స్టేషనుకు తరలించామన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఖేలో ఇండియా ఖోఖో పోటీలకు బాలికల జట్లు

పంగులూరు, అక్టోబరు 5: జాతీయ స్థాయి సౌత్‌జోన్ ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్ల ఎంపిక శనివారం పంగులూరులో జరిగింది. స్థానిక ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన అండర్-14, అండర్-17 బాలికల జట్ల ఎంపికలో కడపడప నుంచి అండర్-14కు జి.హరిత, అండర్-17కు స్రవంతి ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు 16, 17, 18 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగే జాతీయ ఖోఖో పోటీల్లో పాల్గొంటాయన్నారు.

మహిళా డిగ్రీకళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 5: ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో బీఏ, బీఎస్సీ బీకాం కోర్సుల్లో ప్రవేశాలకు 7 నుంచి 9 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఖలీల్‌బాషా తెలిపారు. కళాశాల కార్యాలయంలో అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. పొలిటికల్ సైన్స్ 6, హిస్టరీ 9, స్పెషల్ ఉర్దూ 29, స్పెషల్ ఇంగ్లీష23, ఎకనామిక్స్ 4, బీకాం జనరల్ 6, బోటనీ 3, జువాలజీ 3, కెమిస్ట్రీ 14, ఫిజిక్స్ 8, మేథమేటిక్స్ 14, స్టాటిస్టిక్స్ 25, డేటా సైన్స్ 29 ఖాళీలున్నాయన్నారు.

చేతి నిండా పని - చేతికందని మనీ



- రోజంతా కష్టపడినా తీరని వెతలు
- ఏడు నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందులు పడుతున్న పారిశుధ్య కార్మికులు

సుండుపల్లె, అక్టోబరు 5: పరిసరాలు శుభ్రంగా ఉండాలని వేకువనుంచే పనిలోకి వచ్చి వళ్ల వంచి చేతినిండా పనిచేస్తున్నా చేతికి జీతం అందడం లేదు. ఒక్కరోజు వారు పనిచేయకపోతే రోడ్లపై నడవలేని పరిస్థితి. వందలాది కుటుంబాల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను సేకరించి ఊరి బయటికి తరలిస్తున్నారు. అలాంటి పంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో ఆదాయం వస్తున్నా జీతాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వివరాల్లోకెళితే....

వేకువనే పిల్లాపాపలను వదిలేసి విధుల్లోకి హాజరవుతారు పంచాయతీ కార్మికులు, మన ఊరు బాగుండాలని ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను పోగు చేసి డంపింగ్ యార్డులకు తరలిస్తారు. ఒక్కరోజు పంచాయతీ కార్మికులు పనిచేయకపోతే రోడ్లపై నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి పంచాయతీ కార్మికుల కడుపు నిండడం లేదు. 7 నెలలుగా వారి కి రావాల్సిన జీతాలు ఇవ్వలేదు. రోజూ గొడ్డు కష్టం చేసే కార్మికులకు ఇవ్వడానికి పంచాయతీలో డబ్బు లు లేవా... వస్తున్న ఆదాయం ఏమవుతోందనే ప్రశ్నలు వెల్లువలా వస్తున్నాయి. పనులు చేస్తే కానీ కడుపు నింపుకోలేని పరిస్థితిలో ఉన్న కార్మికు లకు జీతాలు ఇవ్వకపోవడం హాస్యాస్పదమని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులకు చెప్పినా పంచాయతీలో నిధులు లేవని, ఇస్తామని డొంక తిరుగుడు మాటలు చెబుతున్నారని కొందరు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పంచాయతీ కార్మికులకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఎందుకు ఏర్పడింది. పంచాయతీల్లో ఆదాయం ఎంత వస్తోంది, వస్తున్న ఆదాయం ఏమవుతోందనేది ఐదేళ్లగా ఎవరికీ అంతుచిక్కడంలేదు. సుమారు 4 వేల కుటుంబాలు మండల కేంద్రంలో జీవనం సాగిస్తున్నారు. ఆదాయం ఉంటే ఆ ఆదాయం ఐదు నెలలుగా పంచాయితీ కార్మికులకు జీతం ఇచ్చేందుకు కూడా సరిపోవడం లేదా అని పలువురు చర్చించుకుంటున్నారు. జీతాలు ఇచ్చి పుణ్యం కట్టుకోవాలని పంచాయతీ కార్మికులు అధికారులను వేడుకుంటున్నారు.

జీతాలు ఇవ్వకపోతే ఏం తినాలి



ఏడు నెలలుగా జీతం ఇవ్వడంలేదు. జీతాలు ఇవ్వకపోతే మా కుటుంబం ఏం తిని బతకాలి. రోజూ ప్రజల కోసం ఊరు బాగుండాలని కష్టపడు తున్నాము. వారానికి ఒకసారి సంతకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలన్నా నాకు స్తోమత లేదు. జీతం ఇచ్చి పుణ్యం కట్టుకోండి.

ఓబులమ్మ, పంచాయతీ కార్మికురాలు

ఎవరికి చెప్పినా ఫలితం లేదు



రోజూ గొడ్డు కష్టం చేస్తున్నాము. మా కష్టానికి ఫలితం ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వడం లేదు. కష్టపడి పని చేసే వారిని గుర్తించక పోవడం బాధగా ఉంది. వారం రోజులు పని చేయక పోతే గ్రామం చెత్తకుప్పలా మారుతుంది. మాకు రావాల్సిన జీతాలు ఇచ్చి మమ్మల్ని మా కుటుంబాన్ని ఆదుకోండి.

రమణయ్య, పంచాయతీ కార్మికుడు

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

ఖాజీపేట, అక్టోబరు 5: చెన్నముక్కపల్లె గిరిజనవాడ వాసి నాగభూషణం (28) ఉరేసుకుని మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు ఆకుమల్ల సుబ్బరాయుడు కుమారుడు నాగభూషణానికి ఏడేళ్ల కిందట వెల్లంవారి పల్లె వాసి శ్రీవిద్యతో వివాహమైంది. కొద్దిరోజుల నుంచి మద్యంతాగి ఇంటికి రావడంతో భర్త మారేందుకు ఆమె ముగ్గురు పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. నాగభూషణం మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం ఉరివేసుకుని మృతిచెందాడు. భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు.

నిందితుల అరెస్టు - రిమాండుకు తరలింపు

కమలాపురం రూరల్, అక్టోబరు 5: హత్యకేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామ ని సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. కమలాపురం పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 3వ తేదీ సాయంత్రం 6.50 గంటలకు అప్పారావుపల్లెలోని సత్రం వద్ద రామక్రిష్ణారెడ్డిపై యల్లారెడ్డి, విశ్వనాథరెడ్డి, చెన్నారెడ్డి దాడి చేశారు. ఈ దాడి లో రామక్రిష్ణారెడ్డి చనిపోయాడు. కమలాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులు ముగ్గురిని శనివారం అరెస్టుచేసి కమలాపురం కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండుకు విధించిందన్నారు.

27 నుంచి హైదరాబాదుకు ఫ్లైట్

(కడప-ఆంధ్రజ్యోతి): కడప విమానాశ్రయం నుంచి హైదరాబాదు వెళ్లడానికి డైరెక్ట్ ఫ్లైట్ తిరిగి ప్రారంభం కానుంది. 2014-19లో టీడీపీ పాలనలో ఉడాన్ పథకం ద్వారా కడప నుంచి విమాన రాకపోకలు ప్రారంభమయ్యాయి. అనతికాలంలోనే కడప విమానాశ్రయం నుంచి ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. ఎయిర్‌ట్రాఫిక్‌లో ద్వితీయ శ్రేణి ఎయిర్‌పోర్టు జాబితాలోకి వెళ్లిపోయింది. అలా కడప జిల్లా జనానికి ఫ్లైట్ కనెక్ట్ అయింది. అప్పట్లో రోజూ కడప-హైదరాబాదు, కడప-విజయవాడ, కడప-చెన్నైకి ఫ్లైట్లు నడిచేవి. అప్పట్లోనే విమానాశ్రయం విస్తరణకు బీజం పడింది. రాత్రి పూట విమానాలు రాకపోకలు సాగించేలా రన్‌వే అభివృద్ధికి నడుం బిగించారు. అనంతరం జగన్ అధికారంలోకి వచ్చాక రన్‌వే పనులు కొనసాగడం తప్ప ఫ్లైట్ల రాకపోకలపై దృష్టి పెట్టలేదు. దీంతో గతేడాది చివరి నుంచి కడప-హైదరాబాదు మధ్య రోజువారి ఫ్లైట్ నిలిచిపోయింది. ఉడాన్ పథకంలో భాగంగా ప్రభుత్వం తన వాటాను చెల్లించకపోవడంతో ఇండిగో ఫ్లైట్ సర్వీసు నిలిపివేసింది. దీంతో కడప నుంచి కేవలం వారంలో కొన్ని రోజులు మాత్రమే చెన్నై, వైజాగ్, బెంగళూరుకు ఫ్లైట్లు నడిచాయి. అప్పట్లో చంద్రబాబు హయాంలో రోజూ ఫ్లైట్‌లతో కళకళలాడే విమానాశ్రయం జగన్ వచ్చాక వారానికి మూడు రోజులుగా తయారైంది. టీడీపీ అధికారం చేపట్టి ఇటీవల చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. కడప నుంచి వ్యాపారం, ఇతరత్రా నిత్యం హైదరాబాదుకు వెళ్లే వారు విమానం లేక ఇబ్బంది పడుతున్నారంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర విమానాయాన శాఖ మత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. కడప-హైదరాబాదు మధ్య విమానాలు నడపాలంటూ లేఖలు రాశారు. ఈయన విజ్ఞప్తి మేరకు ఈ నెల 27 నుంచి ఇండిగో విమాన సంస్థ రోజూ కడప - హైదరాబాదు మధ్య విమానం నడపనుంది. దీనికి సంబంధించి విమానాశ్రయం అధికారిని వివరణ కోరగా.. 27 నుంచి విమానాలు హైదరాబాదుకు నడుస్తాయని, ఈ మేరకు బుకింగ్‌లు మొదలయ్యాయని తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో ఆదర్శ విద్యార్థులు



పతకాలు సాధించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుల్లంపేట, అక్టోబరు 5: ఎస్‌జీఎఫ్-19 రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రైల్వేకోడూరు జూనియర్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో భార్గవి, లహరి సిల్వర్‌మెడల్ సాధించగా తేజశ్విని బ్రౌన్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

కడప (క్రైం), అక్టోబరు 5: కోటిరెడ్డిసర్కిల్‌లో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలకొండయ్య (60) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు బాలకొండయ్య కోటిరెడ్డి సర్కిల్ వద్ద నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో డ్రైవరుకు జైలు శిక్ష

సంబేపల్లె, అక్టోబరు5: సంబేపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి ఆటో నడిపిన కేసులో నిందితుడు వెంకట్రమణకు రాయచోటి కోర్టు నెల రోజుల జైలు శిక్ష విధించినట్లు సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. గతంలో వెంకట్రమణ మద్యం సేవించి ఆటో నడుపుతుండగా అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు



దువ్వూరు(మైదుకూరు), అక్టోబరు 5: రెండేళ్ల కుమారుడు కనబడలేదంటూ శనివారం దువ్వూరు పోలీసులకు తండ్రి తంగెడుపల్లె సాయికుమార్ ఫిర్యా దు చేశారు. సాయికుమార్ కుమారుడు అమర్ గురువారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. బాలుడు చిలకపచ్చ రంగు దుస్తులు వేసుకుని ఉన్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తించిన వారు ఆచూకీ తెలియ చేయాలని పోలీసులు తెలిపారు.

కడప జిల్లాగానే కొనసాగించాలి

సీఎం చంద్రబాబుకు లేఖ

ప్రొద్దుటూరు, అక్టోబరు 5: వైఎస్ఆర్ కడప జిల్లా పేరును కడప జిల్లాగానే కొనసాగించాలని విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బొల్లవరం ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజ నిర్వహించి అనంతరం సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చారిత్రక విశిష్టత కలిగిన కడప పేరును తొలగించి వైఎస్ఆర్ జిల్లాగా పేరు మార్చడం ప్రజలను తీవ్రంగా బాధించిందన్నారు. కార్యక్రమంలో సమితి నేతలు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శంకర్‌రెడ్డి, డాక్టర్ బ్రహ్మేస్వర్, డాక్టర్ రాజా రామ్మోహన్‌రెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జింకా సుబ్రమణ్యం, ఏపీ ఎన్జీఓ సంఘం తాలుకా ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు మళ్లీ కృష్ణాజలాలు

కొండాపురం, అక్టోబరు 5: గండికోట ప్రాజెక్టుకు కృష్ణాజలాలు శనివారం నుంచి మళ్లీ వస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. జీఎన్ఎస్ఎస్ కాల్వ ద్వారా అవుకు రిజర్వాయిర్ నుంచి 5000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డీఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, మెయిన్ కెనాల్‌కు 50 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. వారం రోజుల కిందట గండికోటకు కృష్ణాజలాలను నిలుపుదల చేయగా ఇప్పుడు మళ్లీ విడుదల చేస్తున్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 24.84 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నేలవాలిన వరిపంటను పరిశీలించిన తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 5: మండలంలోని పలు గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో నేలకూలిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్నికోరారు. గాలివానకు వరిపంట నేలవాలి దెబ్బతిన్న అలిరెడ్డిపల్లె వరి పొలాలను పరిశీలించిన ఆయన నష్టం, పంటకు అయిన ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు ధ్రువకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అకాల వర్షానికి 150ఎకరాల్లో నేలకొరిగిన వరి

పెండ్లిమర్రి, అక్టోబరు 5: లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగుచేసిన వరిపంట అకాల వర్షానికి నేలకొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో బాధిత రైతులు తీవ్రమనోవేదనకు గురవుతున్నారు. మండలంలో పాపాఘ్ని నది తీర ప్రాంతాల్లో సాగైన దాదాపు 150ఎకరాల వరిపంట నేలకొరిగింది. రైతులు సుధీర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితర రైతుల వరి పంట పూర్తిగా నేలకొరిగింది. మరి కొద్దిరోజుల్లో కోతకోయాల్సి ఉండగా అకాల వర్షంతో లక్షలాది రూపాయలు నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. నేలకొరిగిన వరిపంటను మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు తువ్వపల్లెలో పరిశీలించారు. పడిపోయిన వరి పైరులో నీరు తీసివేసి ఆరబెట్టాలని సూచించారు. ఆరబెట్టిన వెంటనే గింజ నాణ్యతపోకుండా లీటరు నీటికి 50గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. విస్తరణ అధికారి గంగాధర్‌రెడ్డి, సిబ్బంది గణేష్‌కుమార్, నియాజుల్లా, రైతులు పాల్గొన్నారు.

రెండు ఎకరాల్లో అరటి పంట నష్టం

లింగాల, అక్టోబరు 5: మండలంలో గురువారం వీచిన గాలులకు రెండెకరాల్లో అరటితోట నేలకొరిగింది. అంబకపల్లె రైతు అరటి పంట గాలులకు నేలకొరగడంతో రైతుకు దాదాపు రెండు లక్షల రూపాయల దాకా నష్టంవాటిల్లిందని ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి తెలిపారు.




అలిరెడ్డిపల్లెలో నేలవాలిన వరిపంటను పరిశీలిస్తున్న తులసిరెడ్డి - తువ్వపల్లెలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ

తహసీల్దారు కార్యాలయంలో సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోం నిధియాదేవి

నందలూరు, అక్టోబరు 5 : రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోం నిధియాదేవి స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాగిరెడ్డిపల్లె సచివాలయం-3లో ఓ ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించిన భూమిని పరిశీలించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూములపై రికార్డులు తనిఖీ చేయడంతో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంబేపల్లె ఎంపీడీవోగా రామచంద్ర



సంబేపల్లె, అక్టోబరు 5: సంబేపల్లె మండల పరిషత్ అభివృద్ధి ఎన్. రామచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సుండుపల్లెలో పని చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో, మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈవోపీఆర్‌డీ సునీల్‌కుమార్, పంచాయతీ సెక్రటరీలు రవీంద్ర, భాస్కరాచారి, వండాడి రవీంద్ర, మోహన్‌బాబు, వివిధ గ్రామ పంచాయతీ సెక్రటరీలు అభినందనలు తెలియజేశారు.

గాలివీడుకు జవహర్‌బాబు...



గాలివీడు: గాలివీడు ఎంపీడీవోగా జవహర్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సిద్ధవటం మండలంలో పనిచేశారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి లింగాలకు బదిలీ అయ్యారు.

లక్కిరెడ్డిపల్లెకు రెడ్డయ్య



లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లె ఎంపీడీవోగా రెడ్డెయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఒంటిమిట్ట మండలంలో ఎంపీడీవోగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కారిస్తామని అన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లిరెడ్డి

ఓబులవారిపల్లె, అక్టోబరు 5 : మండల ప్రజలకు అధికారులు ఎళ్లవేళలా అందుబాటులో ఉండాలని ఎంపీడీవో మల్లిరెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మండలస్థాయి అధికారులతో సమావేశమయ్యారు.

భక్తిశ్రద్ధలతో నాగ ప్రతిష్ఠ




నాగప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

నందలూరు, అక్టోబరు 5 : మండల కేంద్రంలోని కన్యకచెరువు అలుగు సమీపంలోని ముత్తుమారమ్మ ఆలయ ఆవరణంలో శనివారం బళ్లారికి చెందిన బెస్త దేవిక, వారి కూతురు దీప్తి, కుమారుడు కృష్ణ నాగ విగ్రహాలను అందజేశారు. పండితులు నాగరాజస్వామి, ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోడి జయశ్రీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై దాడి

ములకలచెరువు, అక్టోబరు 5: యూట్యూబర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి కెమెరా, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. గుర్రంకొండ మండలం సరిమడుగుకు చెందిన రమేష్ ఓ యూట్యూబ్ చానల్ సీఈవోగా పనిచేస్తున్నాడు. టీడీపీ నేత కొండ్రెడ్డిని ములకలచెరువు సర్కిల్ కార్యాలయానికి తీసుకు రావడంతో కవరేజీ కోసం ఇక్కడికి వచ్చాడు. ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్తుండగా పెద్దపాళ్యం సమీపంలోని వంతెన వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మొహానికి మాస్కులు ధరించి దాడి చేసి అతని వద్దనున్న కెమెరా, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లతో సహా లోగోను లాక్కొని వెళ్లారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు.



ఒంటిమిట్ట: అన్నపూర్ణగా కన్యకాపరమేశ్వరి



సుండుపల్లెలో..



రాయచోటి: అన్నపూర్ణగా చౌడేశ్వరి



చంద్రఘంట అలంకారంలో మన్నూరు ఎల్లమ్మ



నందలూరు: గజలక్ష్మిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

అన్నపూర్ణగా అమ్మవారి దర్శనం

రాయచోటి టౌన్: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో, అగస్త్యేశ్వర స్వామి, కొత్తపేట రామాపురంలోని చౌడేశ్వరి ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. చెక్‌పోస్టు సమీపంలోని ఉమామహేశ్వరి ఆలయంలో గజలక్ష్మిగా దర్శనమిచ్చారు.

ఒంటిమిట్ట : దసరా ఉత్సవాల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరి శనివారం శ్రీ అన్నపూర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవ హారతులు, మంత్రపుష్పం నిర్వహించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

రామాపురం: నీలకంఠ్రావుపేటలోని అమ్మవారిశాలలో శని వారం వాసవీ కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. దర్బారు సాయినగరు అనంత ఆశ్రమంలో సద్గురు దర్గా మాతాజీని భక్తులు దర్శిం చుకున్నారు.

సుండుపల్లి: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి అలయంలో అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు. మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతి మిట్టబిడికిలోని మారెమ్మ తల్లి, కాళికాదేవి అలయంలో శనివారం పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు.

నందలూరు : నాగిరెడ్డిపల్లెలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శనివారం రాత్రి గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురోహితుడు బండాత్మకూరు శివకుమార్‌శర్మ, ఆలయ అర్చకుడు చెరకముడి మృత్యుంజయశర్మ, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాసం వెంకటకుమార్, చలపాటి నరసింహశ్రేష్ఠి, సెక్రటరి గెలివి నాగసురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహప్రసాద్, మంచికంటి నారాయణ, ఆర్యవైశ్య యువ జన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్, కుమార్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మన్నూరు ఉదయగిరి ఎల్లమ్మతల్లి చంద్రఘంట అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొర్రపాటి రవిమోహన్‌స్వామి, నవీన్‌కుమార్‌స్వామి ఉదయం అమ్మవారికి అభిషేకం , కుంకుమార్చన చేసి నైవేద్యాలను సమర్పించారు.

రాజంపేట టౌన్: పట్టణంలోని అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వెంకట రాజంపేటలో సంతానలక్ష్మిగా అలంకరణలో అమ్మవారు కొలువుదీరారు. అమ్మవారిశాల, చౌడే శ్వరిదేవి ఆలయం, వెంకటరాజంపేట ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరై వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవార్లను దర్శించుకున్నారు.

పెనగలూరు: మండల కేంద్రంలోని వినాయకనగర్‌లోని ఆలయంలో దుర్గాదేవి అన్నపూరగా భక్తులకు దర్శనమిచ్చారు. తోడుపనాటి నారాయణమ్మ, కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రైల్వేకోడూరు(రూరల్): స్థానిక కార్యకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనం ఇచ్చారు.

గిరిజనులను దాడుల నుంచి రక్షించాలి : బీకేఎంయూ



భూ పోరాటాలకు సిద్ధం అంటున్న వ్యవసాయ కార్మిక సంఘ నేతలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 5 : మండలంలోని గిరిజనులను దాడుల నుంచి రక్షించాలని, మండలంలోని బంజరు భూములను ప్రతి గిరిజన కుటుంబానికి పంపిణీ చేయాలని రాష్ట్ర కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోపు కృష్ణప్ప, పందుగోల మణి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చిన్న ఓరంపాడులో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండలస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని దళిత గిరిజనులకు గత 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన భూములను రాజకీయ అండదండలతో అగ్రవర్ణాలవారు దౌర్జన్యంగా ఆక్రమించడంతో పాటు వారిపై దాడులు చేస్తున్నారన్నారు. వందలాది ఎకరాల ప్రభుత్వ బంజరు భూములు సైతం ఆక్రమణదారుల కబంధహస్తాల్లో ఉన్నాయన్నారు. మండలంలోని ప్రతి గిరిజన కుటుంబానికి మూడెకరాల చొప్పున భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఆక్రమణకు గురైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని దళిత గిరిజనులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రోజు రోజుకు దళిత గిరిజనులపై దాడులు ఎక్కువ అయ్యాయని, ప్రభుత్వాలు మారినా పాలకుల విధానాలు మారలేదని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల, దళిత గిరిజనుల సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దుర్గ, వెంకటరెడ్డి, డీహెచ్‌పీఎస్ మండల కార్యదర్శి గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్బయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, మల్లిక వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, వెంకటేశ్, నరసింహులు, వంశీ, అంజయ్య, సుబ్బరాఘవులు, సరస్వతి, చరణ్, రాఘవులు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రం ప్రశాంతం

● **టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా**

రాయచోటి టౌన్, అక్టోబరు 5: గత ప్రభుత్వంలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో రాష్ట్రం ప్రశాంతంగా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా అన్నారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంత మంచి పాలన అందించిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కేవలం కూటమి ప్రభుత్వం మాత్రమేనన్నారు. గత ప్రభుత్వంలో దాడులు, దౌర్జన్యాలు, కేసులు, అరాచకాలు, అక్రమాలు తప్ప ఒక్క ఉద్యోగం కూడా కల్పించిన దాఖలాలు లేవన్నారు.గతంలో వైసీపీ నేతలు కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేవారని, ఇప్పుడు మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైఎస్ జగన్మోహన్ రెడ్డితోపాటు వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం అరాచకాలు తట్టుకోలేక వందల సంఖ్యలో కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల లడ్డూ విషయంలో గత ప్రభుత్వం తీవ్ర అపచారం చేసిందన్నారు. శాంతిభద్రతల విషయంలో కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకుని అభివృద్ధికి సహకరించాలని ఆయన హితువు పలికారు.

కబ్జాకోరల్లో ప్రభుత్వ స్థలాలు

● **ఖద్దరు అండతో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు**



మైసూరివారిపల్లె పరిధిలో వంకపొరంబోకు స్థలంలో వేసిన ముళ్ల కంచె

రైల్వేకోడూరు, అక్టోబరు 5: కబ్జా కోరల్లో రైల్వేకోడూరు చిక్కుకుపోయింది. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. ఖద్దరు బాబుల అండతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నా.. అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆక్రమణలు అరికట్టేందుకు రెవెన్యూ అధికారులు నాటిన బోర్డులు అలంకారప్రాయంగా మిగిలాయి. మండలంలోని మైసూరివారిపల్లెలో సర్వే నెంబరు-2085లో సుమారు 17 ఎకరాలు వంక పొరంబోకు కబ్జాకు యత్నించిన పలువురిని గతంలో సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు కలసికట్టుగా అడ్డుకున్నారు. ఇక ఆ గ్రామంలోని వంక పొరంబోకు స్థలాలను కొందరు వ్యక్తులు ఖద్దరుబాబుల అండ చూసుకుని ముమ్మరంగా ఆక్రమిస్తున్నారు. కంచెలు వేస్తున్నారు. కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. మరికొందరు హద్దులు చేసుకున్నారు. అధికారులకు ముడుపులు ఇచ్చి, నాయకుల అండదండలతో ఆక్రమణలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వే నెంబరు-1627లో సుమారు కొన్ని ఎకరాలు ఆక్రమణకు గురైందని స్థానికులు చెబుతున్నారు. రైల్వే కోడూరు ప్రధాన దారి పక్కనే ఓ సినిమా థియేటర్ ఉంది. దానికి ఎదురుగా కోట్ల విలువ చేసే 50 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. అనంతరాజుపేట నుంచి కుక్కలదొడ్డి వరకు ఆక్రమణలు పెరుగుతూనే ఉన్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. వంక పోరంబోకు, నది పోరంబోకు స్థలాలను యథేచ్ఛగా ఆక్రమిస్తూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లు గడిస్తున్నారు. వాటికి వేరే సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయించుకుని అమ్ముకోవడం రైల్వేకోడూరులో కొత్తగా వెలుగులోకి వచ్చింది. తప్పుడు డాక్యుమెంట్లు చూపి, సర్వే నెంబరు మార్చి దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. కొత్తగా కొందరు నాయకులు ఏ ప్రభుత్వం ఉంటే ఆ వైపు ఉండి స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. మండలంలో ఇటీవల ఒక స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయం కూటమి నాయకులకు చెప్పినా ఫలితం లేకపోయింది. వంక, నది స్థలాలను ఆక్రమించకూడదని ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.



మైసూరివారిపల్లె వంకపొరంబోకు, ప్రధాన రహదారిలో రెవెన్యూ అధికారులు నాటిన హెచ్చరిక బోర్డులు (ఫైల్)

ఆక్రమణలను పరిశీలిస్తాం

రైల్వేకోడూరు తహసీల్దార్‌గా కొత్తగా బాధ్యతలు తీసుకున్నాను. ఆక్రమణల విషయం నాకు తెలియదు. ఆక్రమణలను పరిశీలించి బాధ్యు లపై చర్యలు తీసుకుంటాం.

- మహబూబ్‌చాంద్, తహసీల్దార్ రైల్వేకోడూరు

గంజాయి స్వాధీనం

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 25: గంజాయి స్మగ్లర్లపై శనివారం పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. తోకంచి హరీష్ భార్య శైలును మైసూరివారిపల్లె క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని వారి నుంచి కిలో గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కే.హేమసుందర రావు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వివరించారు.

పరారీలో ఉన్న నిందితుడు అరెస్టు

గత నెల 25వ తేదీ నుంచి పరారీలో ఉన్న గంజాయి నిందితుడు రాజంపేట మండలం బోయినపల్లె వాసి తోడేటి శేఖర్‌ను మామిడికాయల మార్కెట్ వద్ద అరెస్టు చేసి అతని వద్ద 1250 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హేమసుందర్ తెలిపారు.

శ్రీగంధం చెట్లు నరికివేత

ములకలచెరువు, అక్టోబరు 5: ములకలచెరువు సమీపంలోని ముంబాయి - చెన్నై జాతీయ రహదారి పక్కనున్న గాలేటివారి పల్లె వద్దనున్న శ్రీ గంధం చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. రైతు ఈడగొట్టి క్రిష్టప్ప పొలంలో శ్రీ గంధం చెట్లు ఉన్నాయి ఇందులో ఓ చెట్టును దుండగులు నరికేశారు. అలాగే మరో చెట్టును సగానికి కోసేశారు. దీనిపై బాధిత రైతు పోలీసు లకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ములకలచెరువు ఎక్సైజ్ ఎస్‌ఐగా బాబు

ములకలచెరువు, అక్టోబరు 5: ములకలచెరువు ఎక్సైజ్ ఎస్‌ఐగా బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా సిద్దవటం ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో బాధ్యతల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వెంకటేశంను గుంతకల్లుకు బదిలీ చేశారు.

ధూపదీప నైవేద్యాలకు నిధుల పెంపు

రాయచోటి టౌన్, అక్టోబరు 5: ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకుల వేతనాలతో పాటు ధూప, దీప నైవేద్యాలకు నిధులను పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు అన్నారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. అర్చకుల వేతనాలను కూడా 5 వేల నుంచి రూ.10 వేలు పెంచారని, ధూప, దీప నైవేద్యాలకు నిధులు పెంచడమే కాకుండా ఆలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో-కన్వీనర్ నిర్మల్‌కుమార్, డాక్టర్ పాలగిరి శ్రీనివాస కుమార్ రాజు, రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు మహమ్మద్‌షబ్బీర్, శ్రీనివాస్‌యాదవ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అక్రమాలను వెలికి తీయండి : టీడీపీ



ఎంపీడీవోతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందలూరు, అక్టోబరు 5 : గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీయాలని టీడీపీ నాయకులు ఎంపీడీవో సుజాతమ్మను కోరారు. శనివారం బాధ్యతలు చేపట్టిన ఆమెను మండలంలోని టీడీపీ నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గొబ్బిళ్ల సుబ్బరాయుడు, పాటూరు గ్రామ అధ్యక్షులు ముమ్మడిశెట్టి రమేష్, నాయకులు మణి, శ్రీరాములు, గంగాధర్, రమేష్ తదితరులు కలిశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మహిళా విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఫైజున్నీషా

గాలివీడు, అక్టోబరు 5: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని లక్కిరెడ్డిపల్లి ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి ఫైజున్నీసా సూచించారు. శనివారం విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా వెలుగు కార్యాలయంలో మహిళా విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాలికలపై లైంగిక వేధింపులు, చిన్నారుల అక్రమరవాణా , బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పేదరికం, నిరక్షరాస్యత వంటివి బాల్య వివాహాలకు ప్రధాన కారణం అన్నారు. బాల్య వివాహాలను గుర్తిస్తే వెంటనే సంబంధాత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సిద్దయ్య, చన్న కృష్ణయ్య, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ఆభరణాల సమర్పణ



స్వామికి ఆభరణాలు సమర్పిస్తున్న ధర్మారెడ్డి, ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులు

గాలివీడు, అక్టోబరు 5: మండల కేంద్రలోని పెద్దూరు వేంకటేశ్వర స్వామికి గీదర ధర్మారెడ్డి, అమరావతి ఉదయ్ కుమార్ కుటుంబాల సభ్యులు శనివారం అలయ కమిటీ సభ్యుల సమక్షంలో మకర తోరణం, కిరీటం, శంకు చక్రాలు, కర్ణాభరణాలు, హస్తాలు, పాదాలు అందజేశారు. అర్చకులు అనంద్ ఆచార్యులు వాటిని స్వామివారికి అలంకరించారు. అనంతరం దేవదాయ శాఖ ఈవో కొండారెడ్డి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి దాతల సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజులు, భక్తులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌తో చమర్తి జగన్‌మోహన్‌రాజు భేటీ



మంత్రి నారా లోకేష్‌తో చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, అక్టోబరు 5 : గుంటూరు జిల్లా ఉండవల్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబును రాజంపేట పార్లమెంట్ అధ్య క్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు శనివారం కలిశారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో రాజకీయ పరిస్థితులు, సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్య క్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రతినిత్యం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే బాధ్యతను ప్రతి నాయకుడు, కార్యకర్త తీసుకోవాలని, ప్రభుత్వ పథకాలను దగ్గరుండి విజయవంతం అయ్యేలా చూడాలని మంత్రి తెలిపారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను చైతన్యపరిచి వారికి అండగా నిలవాలన్నారు. పార్టీ అధినేత ఆశయాలను, సిద్ధాంతాలను తు.చ తప్పక అమలు చేయాలని యువనేత నారా లోకేష్ సూచించినట్లు ఆయన తెలిపారు.

ఏఐ ప్రాథమిక సూత్రాలపై అవగాహన సదస్సు



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

రాజంపేట, అక్టోబరు 5 : స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీలో ఏఐ ప్రాథమిక సూత్రాలు, భవిష్యత్ నిర్మాణం అనే అంశంపై రెండు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెస్సీ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ తిరుపతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్పొరేషన్ ట్రైనర్ జె.దుర్గ, టి.వెంకట పద్మజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూరల్ నెట్ వర్క్స్ అండ్ డీప్ లర్నింగ్, మిషన్ లర్నింగ్ వంటి రంగాల్లో కృత్రిమ మేధస్సు(ఏఐ) ప్రాధాన్యంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ వర్క్‌షాపులో విద్యార్థులు ఏఐ టూల్స్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి రంగాల్లో ఏఐ ఆధారిత ప్రాజెక్టుల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఏఐఎంఎల్ హెచ్‌వోడీ డాక్టర్ టి.హరికృష్ణ, కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.పెంచలయ్య, స్వర్ణ సురేఖ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

రాజంపేట టౌన్, అక్టోబరు 5 : స్థానిక అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి వంద మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఇన్ సర్వీస్ టీచర్లకు అన్నమాచార్య కళాశాలలో ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జయరాంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయవృత్తి ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ అధ్యాపక బృందం, వనజాక్షమ్మ, డాక్టర్ రవీంద్ర నాథ్, ఉత్తమయ్య, శ్రీధర్, వెంకటసుబ్బయ్య, రామకృష్ణ, రాష్ట్ర నలుమూలల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఫ్రీహోల్డ్ భూముల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో

ఒంటిమిట్ట, అక్టోబరు 5 : ఫ్రీ హోల్డ్ భూముల్లో అవ కతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటా మని కడప ఆర్డీవో జాన్ ఎర్విన్ పాలవర్తి అన్నారు. శనివారం సాయంత్రం త హ సీల్దారు కార్యాలయాన్ని తనిఖీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ భూముల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఫిర్యాదు దారులతో సామరస్యంగా గౌరవంగా మాట్లాడాలని సూచించారు. మండలంలోని ఫ్రీహోల్డ్ భూములను త్వరగా గుర్తించి ఆర్డీవో కార్యాలయానికి పంపించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమణమ్మ, డీటీ గౌరి, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

ఆంధ్ర రోడ్డుపై గుంతలు పూడ్చిన తమిళనాడు అధికారులు



రోడ్డుపై ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చిన తమిళనాడు అధికారులు

యాదమరి, అక్టోబరు 5: చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో ఏర్పడిన గుంతలను తమిళనాడు అధికారుల మట్టిపోసి పూడ్చారు. యాదమరి పోలీస్ స్టేషన్ నుంచి తమిళనాడు రాష్ట్ర సరిహద్దుగా ఉన్న కనికాపురం వరకు గజానికో గుంత ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.ప్రధానంగా ఈ మార్గంలో కూరగాయలతోపాటు వందలాది సరకుల రవాణా లారీలు వెళుతుంటాయి. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ఇటీవల తమిళనాడుకు సరకుల రవాణా వాహనాల సంఖ్య తగ్గింది. దీంతో తమిళనాడు రవాణాశాఖ అధికారుల ఆదాయానికి గండిపడింది. ఈ క్రమంలో స్థానికుల సహాయంతో రహదారిపై ఏర్పడిన గుంతలకు మట్టిపోసి పూడ్చారు. ఇదిలా ఉంటే.. పక్క రాష్ట్ర అధికారులు మనరాష్ట్రంలోని రోడ్డుపై మట్టివేసి గుంతలు పూడ్చడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

కొనసాగుతున్న వర్షాలు

శాంతిపురంలో అత్యధికంగా 114.2 మి.మీ వర్షపాతం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 5: జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో తేలికపాటి నుంచి బలంగా 27 మండలాల్లో వర్షం కురిసింది. శాంతిపురంలో అత్యధికంగా 114.2 మి.మీ, బైరెడ్డిపల్లెలో అత్యల్పంగా 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. గుడిపాలలో 64, గంగాధరనెల్లూరులో 56, యాదమరిలో 49.6, గుడుపల్లెలో 45.6, చిత్తూరులో 45, వెదురుకుప్పంలో 40.6, పెనుమూరులో 25.4, తవణంపల్లెలో 22, చౌడేపల్లెలో 21.4, సోమలలో 18.4, వి.కోట, రామకుప్పంలో 18.2, రొంపిచెర్లలో 18, పూతలపట్టులో 15, బంగారుపాళ్యంలో 14.2, ఎస్ఆర్‌పురంలో 12.8, గంగవరంలో 8.4, చిత్తూరు రూరల్‌లో 7.2, పెద్దపంజాణిలో 6.4, పాలసముద్రంలో 6.2, పలమనేరులో 5, పుంగనూరులో 4.8, ఐరాలలో 4.2, పులిచెర్లలో 3.2 మి.మీ వర్షం కురిసింది.

టెట్‌కు 220 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 5: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్)కు శనివారం 265 మంది అభ్యర్థులకు 220 మంది హాజరవగా, 45 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని రెండు సెంటర్లు, చెన్నైలోని ఒక సెంటర్‌లో కేవలం ఉదయం సెషన్‌లో మాత్రమే పరీక్షలు నిర్వహించారు.

1,79,825 మందికి పీఎం కిసాన్ నిధులు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 5: జిల్లాలోని 1,79,825 మంది రైతులకు పీఎం కిసాన్ 18వ విడత నిధులు రూ.35.97 కోట్లు జమయ్యాయి. ఈ నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమైంది.

జాబ్‌మేళాలో 61 మంది ఎంపిక



చిత్తూరు, అక్టోబరు 5: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 131 మంది అభ్యర్థులు పాల్గొనగా వారిలో 61 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి గోపి, ఐటీఐ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి మురళీకృష్ణ, రీజనల్ ప్లేస్‌మెంట్ అధికారి యుగంధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



జుబేర్

పుంగనూరు రూరల్, అక్టోబరు5: ఓ యువకుడు మూడు రోజుల క్రితం అదృశ్యమైనట్లు అతడి అమ్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి కథనం మేరకు ... కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురానికి చెందిన వసీమ్ కుమారుడు ఎస్. జుబేర్ వెల్డర్‌గా పని చేస్తూ కొంత కాలంగా పుంగనూరులోని ఉబేదుల్లా కాంపౌండ్‌లో ఉన్న అమ్మమ్మ పర్విన్‌తాజ్ ఇంట్లో ఉన్నాడు. మూడు రోజుల క్రితం పనికి వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయట వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు కనిపించపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

కుంకీ ఏనుగుల విడిది కోసం ఏర్పాట్లు





కుంకీ ఏనుగుల కోసం ముసలిమడుగు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన క్రాల్స్ - కుంకీ ఏనుగుల కోసం ఏర్పాటు చేసిన భారీ నీటి కుంట

పలమనేరు, అక్టోబరు5 : పలమనేరు అటవీ రేంజి సరిహద్దులో ఉన్న పంట పొలాలపై ఏనుగుల దాడులను నియంత్రించేందుకు వస్తున్న శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల విడిది కోసం ఏర్పాట్లు పూర్తిచేశారు. పంట పొలాలపై దాడులకు వస్తున్న ఏనుగులను అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు ట్రాకర్లను ప్రభుత్వం రెండు దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసింది. వీరు ఆయా గ్రామాల వద్ద వుంటూ ఏనుగులు వచ్చిన సందర్భంలో గ్రామస్తుల సహకారంతో బాణసంచా కాల్చుతూ డప్పులు కొడుతూ అటవీ ప్రాంతంలోకి తరిమివేస్తున్నారు. అయినా రాత్రి వేళ ఏనుగులు పంట పొలాలపైకి వచ్చి పంటలు తిని తొక్కి నాశనం చేసి వెళ్లిపోతూనే వున్నాయి. ట్రాకర్లు ఉన్నప్పటికీ వీరు పూర్తిస్థాయిలో ఏనుగుల దాడులను కట్టడి చేయలేకపోతున్నారు. అర్ధరాత్రివేళ పొలాల వద్ద వుండలేక రైతులు చీకటి పడగానే గ్రామాలకు వస్తున్నారు. ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించా లంటే కుంకీ ఏనుగుల ద్వారా మాత్రమే సాధ్యమని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. దీంతో వాటిని రప్పించేందుకు ఇక్కడ అటవీ శాఖ అధికారులు కుంకీ ఏనుగుల విడిది కోసం ఏర్పాట్లు చేశారు.

కుంకి ఏనుగుల ఆహారం ఎలా : పలమనేరు ప్రాంతంలో ఏనుగుల దాడులను నివారించేందుకు తీసుకొస్తున్న కుంకీ ఏనుగులకు విడిది ఏర్పాటు చేశారే గానీ వాటికి ఆహారం ఎలా అందజేయాలన్న విషయంలో మాత్రం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అంతేకాక వస్తున్న కుంకి ఏనుగులు ఎన్ని అన్న విషయం కూడా పూర్తిగా నిర్ధారించలేకపోతున్నారు. కొందరు 4 వస్తాయని అంటుంటే, మరికొందరు రెండు కుంకి ఏనుగులు మాత్రమే వస్తాయని చెబుతున్నారు.

ఏనుగుల దాడులకు ప్రధాన కారణం ఆహార సమస్య : ఏనుగుల దాడులను నివారించేందుకు ప్రభుత్వం సోలారు విద్యుత్, కందకాలు ఏర్పాటు, ట్రాకర్ల నియామకం చేస్తున్నదే గానీ వాటి ఆహారం గురించి ఏమాత్రం చర్యలు తీసుకోలేదని ప్రజలంటున్నారు. ఏనుగులకు ప్రధానంగా వెదురు, చిన్నమొక్కలు, చెట్లబెరడు, అడవుల్లో లభించే పండ్లు, చిన్నచిన్న పొదలను తింటాయి. ప్రతిరోజూ ఒక ఏనుగు కనీసం 150 నుంచి 170 కిలోల శాఖాహారాన్ని తింటుంది. వాటి శరీర ఆకృతిని, వయసును బట్టి 80 నుంచి 110 లీటర్ల నీరు తాగుతుంది. మూడు దశాబ్దాలుగా పలమనేరు అటవీ ప్రాంతంలో ఏనుగుల ఆహారం కోసం అధికారులు ఏ ఒక్క చర్య తీసుకోకపోవడం గమనార్హం.

రెండో రోజూ కొనసాగిన గజదాడులు





ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి, మామిడిచెట్లు

కల్లూరు, అక్టోబరు 5: పులిచెర్ల మండలం బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి వద్ద రెండవ రోజు శుక్రవారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగాయి. దీంతో వరి, మామిడి, సపోటా, బొప్పాయి, అరటి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. గౌరిశెట్టివారిపల్లిలోని ఉషకు చెందిన వరి, అరటి పంటను, నాదమునికి చెందిన వరి పంటను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి రైతు కోదండయ్యకు చెందిన అరటి, సపోటా, బొప్పాయి చెట్లను ఏనుగుల గుంపు విరిచేశాయి. ఇదే గ్రామంలోని రైతు లవకుమార్‌కు చెందిన మామిడిచెట్లు, వీరయ్యకు చెందిన వరి పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడి చేసిన పంటలను ఐరాల సెక్షన్ ఎఫ్‌బీఓ శ్రీదేవి పరిశీలించి పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని తెలిపారు.

టీటీడీ ఆధ్వర్యంలో డెయిరీ నిర్వహించాలి

సీఎంకు బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ లేఖ

పుంగనూరు, అక్టోబరు5: టీటీడీ ఆధ్వర్యంలో డెయిరీ నిర్వహించాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వివాదంపై పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. తాను తిరుమలకు ఉచితంగా 1000 పాడి ఆవులు అందజేస్తామన్నారు.

ఆస్పియా హత్య కేసులో పోలీసుల వైఫల్యం

కుటుంబాన్ని పరామర్శించిన పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి



పుంగనూరు, అక్టోబరు5: పుంగనూరులో చిన్నారి ఆస్పియా(6) హత్య కేసులో పోలీసుల అసమర్థత, వైఫల్యం కనిపిస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక ఉబేదుల్లా కాంపౌండ్‌లో ఆస్పియా తల్లిదండ్రులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. చిన్నారి అస్పియా అదృశ్యమై, హత్య జరిగి వారం రోజులు అవుతున్నా నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మృతురాలి కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం సమ్మర్ స్టోరేజ్‌ను పరిశీలించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుకు సాదర వీడ్కోలు



చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యేలు అమర్, భానుప్రకాష్, మురళీమోహన్, టీడీపీ నాయకుడు శ్రీధర్‌వర్మ

రేణిగుంట, అక్టోబరు 5: ముఖ్యమంత్రి చంద్రబాబుకు తిరుపతి విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. శనివారం తిరుమల పర్యటన ముగించుకుని ఉదయం 11.53గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తిరుగు పయనం అయ్యారు. ఆయనకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్, అనంతపురం డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, శ్రీకాళహస్తి, తిరుపతి, పూతలపట్టు, నగరి, పలమనేరు, జీడీ నెల్లూరు ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, అరణి శ్రీనివాసులు, మురళీమోహన్, భానుప్రకాష్, అమర్‌నాథ్‌రెడ్డి, థామస్, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, వరప్రసాద్, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్, శ్రీధర్ వర్మ, ఆర్‌సీ మునికృష్ణ, ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు. అంతకు ముందు విమానాశ్రయం వద్ద కార్యకర్తలను, నాయకులను పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. వినతులు స్వీకరించారు.

సీఎంను కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి



చంద్రబాబుతో హేమాంబరధరరావు

చంద్రగిరి, అక్టోబరు 5: ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు తీసుకువచ్చిన చంద్రబాబును శనివారం తిరుమలలో హేమాంబరధరరావు కలిశారు.

9న మాజీ సీఎం జగన్ పుంగనూరు రాక

పుంగనూరు, అక్టోబరు5: పుంగనూరులో చిన్నారి అస్పియా హత్య జరగడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈనెల 9న పుంగనూరుకు రానున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆస్పియా మృతిచెందడం బాధకరమని, ఆ ఘటనను ఖండిస్తూ బాధితులకు అండగా ఉండేందుకు జగన్ వస్తున్నట్లు చెప్పారు.

నేలపట్టు పక్షుల కేంద్రం సందర్శన ప్రారంభం

దొరవారిసత్రం, అక్టోబరు 5: తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలోని విదేశీ విహంగాల (పక్షులు) విడిది కేంద్రం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శకుల కోసం అధికారులు శనివారం ప్రారంభించారు. ఏప్రిల్‌లో పక్షుల విడిది పూర్తికాగానే మే నెలలో సందర్శకులకు అనుమతి నిలిపేశారు. పక్షుల విడిది మళ్లీ ప్రారంభం కావడంతో శనివారం గేట్లు తెరిచారు. అయితే ఈ ప్రాంతంలో వర్షాలు పెద్దగా పడకపోవడం, కేంద్రంలోని రెండు మంచి నీటి చెరువుల్లో నీరు లేకపోవడంతో పక్షుల విడిది ఇంకా ప్రారంభం కాలేదు. ఈ వారంలో పైలెట్ పక్షుల రాక ఉండవచ్చునని, అవి వచ్చి వెళ్లిన వారంలో పక్షుల రాక మొదలవుతుందని స్థానిక వన్యప్రాణి సంరక్షణ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. కాగా, సూళ్లూరుపేట వన్యప్రాణి సంరక్షణ శాఖ డీఎఫ్‌వో హారిక నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని సందర్శించారు. పక్షుల విడిది సమయంలో సిబ్బంది తీసుకునే చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.





వర్షంలో తడుస్తూ వెళుతున్న భక్తులు - రాంభగీచ వద్ద ప్రవహిస్తున్న నీరు

తిరుమలలో భారీ వర్షం

శ్రీవారి ఆలయ ధ్వజస్తంభం వద్ద నిలిచిన నీరు



శ్రీవారి ఆలయంలో చేరిన నీటిని బయటకు పంపుతున్న దృశ్యం

తిరుమల, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి):తిరుమలలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసినప్పటికీ 30 నిమిషాల వ్యవధిలోనే నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు మొదలైన వర్షం 2 గంటల వరకు కురిసింది.శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, గ్యాలరీలు, రోడ్లు తడిచిముద్దయ్యాయి.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులతో పాటు దర్శనం పూర్తిచేసుకుని ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు కూడా వర్షంలో తడుస్తూనే వెళ్లారు. వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు కూడా వర్షంలో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద కూడా వర్షపు నీరు భారీగా నిలిచింది. దీంతో పైప్ సహాయంతో నీటిని వేగంగా ఆలయం బయటకు తరలించారు. సాయంత్రం 4 గంటల సమయానికంతా నీరు మొత్తం కాలువల ద్వారా వెళ్లిపోవడంతో పాటు తేమ ఆరిపోయింది. దీంతో రాత్రి వాహనసేవకు వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్యాలరీల్లో కూర్చోగలిగారు.

'మెరిడియన్' మాయాజాలం



కార్పొరేషన్ కట్టిన బిల్డింగ్‌కే నో 'ప్లానింగ్' - దర్జాగా డీవియేషన్స్, పార్కింగ్ లేదు

- వైసీపీ చిన్నయ్య అనుచరుడి కోసం కొనసాగుతున్న కార్పొరేషన్ సహకారం

తిరుపతి-ఆంధ్రజ్యోతి

తిరుపతి నగరంలో నిబంధనలు ఉల్లంఘించి ఏదైనా నిర్మాణం జరుగుతుంటే కార్పొరేషన్ కొరడా ఝళిపిస్తుంది. మరి కార్పొరేషనే నిబంధనలు గాలికొదిలేసి నిర్మాణం చేసేస్తే ఎవరు చర్యలు తీసుకోవాలి? జగన్‌రెడ్డి పాలనలో తిరుపతిలో చక్రం తిప్పిన వైసీపీ చిన్నయ్య అనుచరుడి కోసం కార్పొరేషన్ కళ్లు కుట్టేసుకుని పని కానిచ్చేసింది. కపిలతీర్థం నంది సర్కిల్ వద్ద రూ.2కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో పిలిగ్రిమ్ ఎమినిటీస్ సెంటర్ పేరిట 10వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన జీ+2 అంతస్తుల భవనాన్ని కారుచవగ్గా చిన్నయ్య అనుచరుడికి కటబెట్టేశారు కూడా. ప్రభుత్వం మారి వైసీపీ దందాలకు కాలం ముగిసినా అత్యంత విలువైన కూడలిలోని ఈ భవనాన్ని దక్కించుకున్న వైసీపీ నాయకుడు ఏ ఆటంకమూ లేకుండా వ్యాపారం చేసుకుంటూ ఉండడం విశేషం. ఇక్కడ రోడ్డు మీదే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. తిరుమలకు వెళ్లే వాహనాల రద్దీ ఉండే ఈ ప్రదేశంలో ఇది ప్రమాదకరం కూడా. ప్రస్తుత కార్పొరేషన్ అధికారులైనా ఈ భవనం విషయంలో జరిగిన అక్రమాలు గ్రహించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటారేమో చూడాలి.

నిబంధనలు ఇలా ఉల్లంఘించారు..

● టౌన్ ప్లానింగ్ నిబంధనలు పూర్తిగా గాలికొదిలేసి అర్ధ వృత్తాకారంలో ఈ భవనాన్ని నిర్మించారు. ● నిబంధనల మేరకు నాలుగు వైపులా 3 మీటర్ల చొప్పున సెట్ బ్యాక్స్ వదలాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ● వాణిజ్య అవసరాల కోసం నిర్మించిన భవనం కాబట్టి 200 చ.మీ. పార్కింగ్ స్థలం కేటాయించాలి. అటువంటి ఏర్పాటు ఏదీ చేయలేదు. ● జీ+2తో నిర్మాణానికి అదనంగా మరో అంతస్తు వేసుకునే ప్రయత్నం టెండరు దక్కించుకున్న వ్యక్తి చేస్తున్నారు. ● దక్షిణ వైపు మరికొంత ఆక్రమించి మరీ ప్రహరీ నిర్మించుకున్నారు.

నెలకు అద్దె లక్షన్నరే!

కీలక ప్రదేశంలోని ఈ భవనం కార్పొరేషన్‌కు పెద్ద మొత్తంలో ఆదాయవనరుగా మారబోతోందని నిర్మాణ దశలో ఉన్నప్పుడు పరిశీలించిన అప్పటి కమిషనర్ అనుపమ చెప్పారు. చదరపు అడుగుకు కనీసం రూ.60 తక్కువ లేకుండా ఆ ప్రాంతంలో అద్దె డిమాండు ఉంది. అంటే నెలకు రూ.6లక్షల చొప్పున ఏడాదికి రూ.72లక్షలు కార్పొరేషన్‌కు కనీస ఆదాయం వస్తుంది. బాగా డిమాండు ఉన్న ప్రాంతం కాబట్టి టెండరులో ఏడాదికి కోటి రూపాయల వరకు పలకవచ్చు కూడా. అయితే అధికార పార్టీ పెద్దల ఒత్తిడితో జన బాహుళ్యానికి పెద్దగా తెలియని పత్రికల్లో ప్రకటన ఇచ్చి నాలుగు గోడల మధ్య టెండరు నిర్వహించేశారు. కేవలం నెలకు లక్షన్నర అద్దెతో ఇంత విలువైన భవనం కట్టబెట్టేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


సునీతా (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, అక్టోబరు5: మదనపల్లె మండలం డీఎస్‌రెడ్డి కాలనీలో సునీతా(45) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం మండలంలోని ఎర్రగానిమిట్ట సమీపంలో బీఎస్‌రెడ్డి కాలనీకి చెందిన ఎర్రబల్లి చలపతి భార్య ఎర్రబల్లి సునీతా ఒక్కరే నివాసం ఉంటున్నారని మూడు రోజుల క్రితం ఏమి జరిగిందో కాని ఆమె నోటినుంచి రక్తం వచ్చి మృతి చెందినట్లు తెలిపారు. అయితే ఈ మృతిపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

శ్రీగంధం చెట్లు నరికివేత

ములకలచెరువు, అక్టోబరు 5: ములకలచెరువు సమీపంలోని ముంబాయి - చెన్నై జాతీయ రహదారి పక్కనున్న గాలేటివారి పల్లె వద్దనున్న శ్రీ గంధం చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. రైతు ఈడగొట్టి క్రిష్ణప్ప పొలంలో శ్రీ గంధం చెట్లు ఉన్నాయి ఇందులో ఓ చెట్టును దుండగులు నరికేశారు. అలాగే మరో చెట్టును సగానికి కోసేశారు. దీనిపై బాధిత రైతు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

యూట్యూబర్‌పై దాడి..పోలీసులకు ఫిర్యాదు

ములకలచెరువు, అక్టోబరు 5: ములకలచెరువు మండలం పెద్దపాళ్యం సమీపంలో శనివారం యూట్యూబర్‌పై దాడి చేసి అతని వద్దనున్న కెమెరా, ల్యాప్‌ట్యాబ్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుర్రంకొండ మండలం సరిమడుగుకు చెందిన రమేష్ జీ 9 యూట్యూబ్ ఛానల్ సీఈవోగా పనిచేస్తున్నాడు. టీడీపీ నేత కొండ్రెడ్డిని ములకలచెరువు సర్కిల్ కార్యాలయానికి తీసుకు రావడంతో కవరేజీ కోసం ఇక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో తిరిగి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్తుండగా పెద్దపాళ్యం సమీపంలోని వంతెన వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మొహానికి మాస్కులు ధరించి దాడి చేసి అతని వద్దనున్న కెమెరా, ల్యాప్ ట్యాప్, సెల్‌ఫోన్లతో సహా లోగోను లాక్కొని వెళ్లారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

ఆటో బోల్తాపడి విద్యార్థిని మృతి

మదనపల్లె అర్బన్, అక్టోబరు5: గుర్రంకొండ సమీపంలో ఆటో బోల్తా పడిన ప్రమాదంలో మేఘన (18) అనే విద్యార్థిని మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మదనపల్లె అవుట్ పోలీసుల కథనం మేరకు గుర్రం కొండకు చెందిన బాబు కుమార్తె మేఘన తమ అవ్వ లక్ష్మీదేవి వద్ద కోటకొండలో ఉంటూ బీఎస్సీ చదువుకొంటుంది. తమ్ముడి కార్తీక్ బర్తడే ఉండడంతో తన తండ్రి బాబు, బంధువు కళావతితో కలిసి ఆటోలో వస్తుండగా గుర్రంకొండ సమీపంలో ఆటో శనివారం బోల్తా పడి పల్టీలు కొట్టింది. అందులో గాయపడిన విద్యార్థిని మేఘన మృతి చెందింది. పోర్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ఆస్పతికి మృతదేహాన్ని తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు గుర్రంకొండ పోలీసులు తెలిపారు.

స్కూటర్ కింద పడి ఇరువురికి గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 5: ద్విచక్రవాహనంపై వెళుతూ ఇద్దరు వ్యక్తులు కిందపడి గాయపడ్డారు. మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిఅవుట్ పోస్టు పోలీసుల వివరాల మేరకు గుర్రం కొండ మండ లం చెర్లోపల్లెకు చెందిన రవీంద్ర (48), అల్లుడు చక్రవర్తి గుర్రం కొండ మండలం, పాములవారిపల్లె వద్ద స్కూటర్ అదుపుతప్పి కిందపడడంతో వారికి గాయాలయ్యాయి. దీంతో వారు మదన పల్లె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బి.కొత్తకోట, అక్టోబరు 5: బి.కొత్తకోట మండలంలోని కాండ్లమడుగు క్రాస్ సమీపంలో గత నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చాంద్‌బాషా(27) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్టు సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు. ద్విచక్ర వాహనంలో వస్తూ తనముందు వెళుతున్న ఆటోను ఢీకొని తీవ్రంగా గాయపడిన చాంద్‌బాషాను మదనపల్లెకు, అక్కడి నుంచి బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వెనుకకు తీసుకొచ్చి మదనపల్లె ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అన్న గౌస్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

స్మగ్లరు అరెస్టు.. దుంగలు స్వాధీనం

పీలేరు, అక్టోబరు 5: స్మగ్లరుతో సహా ఒక వాహనం, నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరు మండలం పొంతలచెరువు క్రాస్ వద్ద శనివారం వాహనాల తనిఖీల్లో భాగంగా రాయచోటి నుంచి పీలేరువైపు వస్తున్న ఓ వాహన డ్రైవర్ కారుని వదిలి పారిపోగా అందులో ఉన్న తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా కుంబలూరు గ్రామానికి చెందిన అప్పస్వామి కన్నుస్వామి(29)ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కారును తనిఖీ చేయగా అందులో 118 కేజీల బరువున్న నాలుగు ఎర్రచందనం దుంగలు లభ్యమైనట్లు తెలిపారరు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సెమినార్లతో బిడియం పోతుంది

మదనపల్లె టౌన్, అక్టోబరు 5: ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంటర్వ్యూల్లో బిడియం పోవాలంటే వారితో సెమినార్లు నిర్వహించాలని అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ శివకుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు స్టేజ్ ఫియర్ ఉండకూడదన్నారు. దీన్ని నివారించడానికి అన్ని భాషల్లో పట్టు సాధించాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంచుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ ఐఎస్‌టీఈ వేదికల ద్వారా విద్యార్థులు పర్సనాలిటి డెవలప్‌మెంట్ పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సతీష్‌బాబు, ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

డీటీసీహెచ్‌గా నారాయణరెడ్డి

రామసముద్రం, అక్టోబరు 5: రామసముద్రం మండలం డీటీసీహెచ్‌గా నారాయణరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పీలేరు నుంచి సాధారణ బదిలీపై రామసముద్రం వచ్చినట్లు తెలిపారు. కాగా ఇక్కడ డీటీసీహెచ్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు నిమ్మనపల్లెకు బదిలీపై వెళ్లారు.

ములకలచెరువు ఎక్సైజ్ ఎస్ఐగా బాబు

ములకలచెరువు, అక్టోబరు 5: ములకలచెరువు ఎక్సైజ్ ఎస్ఐగా బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా సిద్దవటం ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు బదిలీ చేయడంలో బాధ్యతల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకటేశంను గుంతకల్లుకు బదిలీ చేశారు.

ఎంపీడీవోగా హరినారాయణ

ములకలచెరువు, అక్టోబరు 5: ములకలచెరువు ఎంపీడీవోగా హరినారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న పోలప్ప శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కురబలకోట ఎంపీడీవోగా పనిచేస్తున్న హరినారాయణను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న గౌస్‌బాషాను రామసముద్రం ఎంపీడీవో కార్యాలయంకు బదిలీ చేశారు.

అన్నపూర్ణగా దర్శనమిచ్చిన అమ్మవారు


అన్నపూర్ణేశ్వరి మదనపల్లె | గాయత్రిదేవీ కురబలకోట | అన్నపూర్ణేశ్వరి నిమ్మనపల్లె | అన్నపూర్ణాదేవి పీలేరు | వైష్ణవిదేవి వాల్మీకిపురం | మీనాక్షిదేవి కలికిరి | అన్నపూర్ణాదేవి కలకడ | కనకదుర్గ మదనపల్లె

మదనపల్లె అర్బన్, అక్టోబరు5: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన శనివారం అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. మదనపల్లె పట్టణంలోని వాసవీభవన్ వీధిలో వెలసిన వాసవీ కన్యాకాపరమేశ్వరీ దేవి మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అనుబంద సంస్థల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు రామచంద్ర అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకరణతో విశేషంగా పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మదనపల్లె ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, ఉపాధ్యక్షుడు దేవతా సతీష్, కార్యదర్శి సూరేగిరిధర్ పాల్గొన్నారు. కోర్టులో వెలసిన గంగమ్మకు పసుపు అలంకరణ చేసి ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్నరెడ్డెప్ప, కార్యదర్శి మార్వారి ప్రభాకర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు, కమిటీ సభ్యులు భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఆలయంలో పొంగళ్లు నైవేద్యంగా తెచ్చి అమ్మకు సమర్పించారు. నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య, కార్యదర్శి పవన్‌కుమార్‌ల పర్యవేక్షణలో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దేవతానగర్‌లోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని మధురమీనాక్షీదేవి అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేవళంవీధిలోని సోమేశ్వరస్వామిఆలయంలో అమ్మవారిని కనకదుర్గా అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో ధనలక్ష్మీ అలంకరణ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనపగుట్టలోని అభయలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహుడికి కనకదుర్గ అలంకరణతో పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. కురవంకలోని భువనేశ్వరి ఆలయంలో దుర్గమాతకు విశేషపూజలు నిర్వహించారు.

పీలేరులో: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం పీలేరు గ్రామ దేవత రౌద్రాల అంకాళమ్మ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నెహ్రూబజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, మోడల్ కాలనీ వద్దనున్న ఎల్లమ్మ, ఇందిరమ్మ కాలనీ వద్దనున్న దిన్నె గంగమ్మలు గాయత్రి దేవి అలంకారాల్లో దర్శనమిచ్చారు. దేవీ నవరాత్రులతోపాటు పెరటాసి మాసం మూడవ శనివారం కూడా కావడంతో శనివారం మహిళలు అమ్మవార్లను పెద్దఎత్తున దర్శించుకున్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వాల్మీకిపురంలో: దసరా శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా మండలంలోని సత్యమ్మ దేవత ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. అలాగే చింతపర్తి వాసవీ ఆలయం, స్థానిక నల్లవీరగంగాభవానీ అమ్మవారి ఆలయం, గొల్లపల్లె విరూపాక్షమ్మ తల్లి ఆలయాల్లో అమ్మవార్లకు అన్నపూర్ణాదేవి అలంకరణలు చేశారు. కోనేటివీధిలోని శివాలయంలో లక్ష్మీకామేశ్వరిదేవికి వైష్ణవిదేవి గాను, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి దేవికి గలజలక్ష్మీదేవి అలంకరణలతో విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాల ధర్మకర్తలు పులి సత్యారెడ్డి, కాంతరాజు, సతీష్, రమణారెడ్డి, కువైట్ శంకరాచారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కలికిరిలో: స్థానిక గ్రామ దేవత ఎల్లమ్మ దేవత శనివారం అన్నపూర్ణాదేవి అలంకరణలో సాక్షాత్కరించారు. ఆలయ నిర్వాహకులు అశోక్‌కుమార్ రెడ్డి, మధుసూదన రెడ్డి, సురేంద్ర రెడ్డి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మీనాక్షి రూపంలో దర్శనమిచ్చి భక్తులకు కనువిందు చేశారు. కలికిరి పంచాయతీలోని చక్కెరవాండ్లపల్లెలో శనివారం వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించి, శ్రీదేవి భూదేవి సమేత స్వామివారిని సాయంకాలంలో పల్లకిలో ఊరేగించారు.

కలకడలో: మండలంలోని కోనలో వెలసిన చౌడేశ్వరిదేవి రెండవ రోజైన శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కలకడలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కురబలకోటలో: దసరాశరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకరణలో శనివారం దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కార్యక్రమంలో బాలకృష్ణ, నాగరాజగుప్త, రామకృష్ణ, సేతు మాధవ్, అమర్‌నాథ్, గుప్త, మారుతీ కుమార్, రామ్మోహన్, అర్చకులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: దశరా నవరాత్రులు సందర్భంగా నిమ్మనపల్లి పంచాయతి పెద్దమాదిగపల్లి వెలసిన మాతమ్మతల్లి ఆలయంలో రెండో రోజు అమ్మ వారు అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. అలాగే ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ


సబ్ కలెక్టర్‌కు భూ సమస్యను వివరిస్తున్న కమ్మవారిపల్లె రైతు

రామసముద్రం, అక్టోబరు 5: రామసముద్రం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మదనపల్లె సబ్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 22ఏ, ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ నిర్మలాదేవిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో భద్రపచిరిన రికార్డులు, వీడియో కాన్ఫరెన్స్ గదులను పరిశీలించారు. అంతకు ముందు మండలంలోని కాప్పల్లె పంచాయతీలో సర్వే నెంబర్ 146లో 58సెంట్లకు సంబంధించి ల్యాండ్ కన్వెన్షన్ భూమిని పరిశీలించారు. మండలంలోని కమ్మవారిపల్లెకు చెందిన ఓ రైతు తనకు సంబంధించి సర్వే నెంబరు 101/7లో 1.36సెంట్ల భూమిలో 36 సెంట్లు అన్యాక్రాంతమైందని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సబ్ కలెక్టర్ సంబంధించిన వీఆర్వోను వివరణ కోరగా ఆ భూమిపై ఇరుపక్షాలు కోర్టుకు వెళ్లారని తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ వివాదాస్పద భూములను వీఆర్వో, తహసీల్దార్ సమక్షంలో పూర్తి వివరాలు సమర్పించి పరిష్కరించుకోవాలన్నారు.

తెట్టు- పులుసుగుంతల బస్సు ప్రారంభం



కురబలకోట, అక్టోబరు 5: మండలంలోని తెట్టు పంచాయతీ తెట్టు-పులుసుగుంతల ఆర్టీసీ బస్సు సేవలను కొత్తగా శనివారం ప్రారంభించారు. కాగా పులుసుగుంతలు, ఆరోగ్యపురం, దిగువపాలెం తదితర ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కళాశాల, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నడక లేక ద్విచక్రవాహనాల ద్వారా దాదాపుగా 5కిలో మీటర్లు రాకపోకలు సాగించేవారు. దీంతో పలువురు టీడీపీ నేతలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన మంత్రి బస్సును ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కామకోటి ప్రసాద్‌రావు, వైస్ సర్పంచ్ బొగ్గ భాస్కర్, శ్రీనివాసులు, తిమ్మరాయుడు, గోపాలకృష్ణ, సుధాకర్, వెంకట్‌రెడ్డి, గంగిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మినీ ఆర్వో వాటర్ ప్లాంటు వితరణ

తంబళ్లపల్లె, అక్టోబరు 5: తంబళ్లపల్లె ఉన్నత పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం దాత శ్రీనివాసులు మినీ ఆర్వో వాటర్ ప్లాంటును వితరణగా అందచేశారు. కొటాల పంచాయతీ జరిపాటిదిన్నెకు చెందిన శ్రీనివాసులు రూ.25వేలు విలువ గల మినీ ఆర్వో వాటర్ ప్లాంటును ఎస్ఎంసీ చైర్మన్ సుగవాసి శివకుమార్, హెచ్‌ఎం శ్రీనివాసులుకు అందచేయగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేశారు.

పీఎమ్ కిసాన్ నిధులు విడుదల

నిమ్మనపల్లి, అక్టోబరు 5: మండలంలోని పది పంచాయతిల్లో ఉన్న రైతులకు ప్రధానమంత్రి సహాయనిధి కింద నిధులు మంజూరు అయ్యాయని ఏవో మురళీమోహన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అర్హులైవుండి పట్టాదారులైన 6449మంది రైతులకు గానూ రూ.1.28 కోట్లు రైతులకు వచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 5న 18వ విడత నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కో రైతుకు రూ.2వేలను వారి వ్యక్తి గత ఖాతాకు జమచేసినట్లు తెలిపారు.

ప్రతి క్రీడాకారుడు మెరుగ్గా రాణించాలి


క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం చెంగల్‌రాయులు

కలకడ, అక్టోబరు 5:రాజమండ్రిలో ఈ నెల 7, 8 తేదిలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపికైన ప్రతి క్రీడాకారుడు మెరుగ్గా రాణించాలని హెచ్‌ఎం చెంగల్‌రాయులు కోరారు. కోన హైస్కూల్‌లో పీడీ రూప్సీరాణి నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సొంత నిధులు రూ.11 వేల తో కొనుగోలు చేసిన క్రీడా దుస్తులను టీమ్ సభ్యులకు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, అక్టోబరు 5: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పట్టుదలగా కృషి చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు విద్యకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఆయన శ్రమిస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో శనివారం కలికిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం ఎన్నో ప్రయాసలకోర్చి కలికిరిని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దిందని ఇందులో భాగంగా మూడు పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల, సైనిక్ స్కూల్, మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, గురుకుల పాఠశాలల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. ప్రైవేటు పాఠశాలల్లో మరింత నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. సమావేశం అనంతరం ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను కిశోర్‌కుమార్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కరీముల్లా, నాగార్జున రెడ్డి, సంఘం నాయకులు విశ్వనాథ రెడ్డి, వెంకట్రమణా రెడ్డి, రవీంద్రనాథ రెడ్డి, జనార్ధన రెడ్డి, శివకుమార్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, మాధవి, డి.వెంకట్రమణా రెడ్డి, రామాంజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

పీలేరు, అక్టోబరు 5: మహిళా చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని పీలేరులోని 11వ అదనపు జిల్లా జడ్జి మహేశ్ విజ్ఞప్తి చేశారు. పీలేరు మండలం తలపుల గ్రామంలో శనివారం ఆయన 'విధాన్ సే సమాధాన్' పేరిట చట్టాలపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకుని, అవసరమైన సమయాల్లో వాటిని సద్వినియోగం చేసుకుని జీవితాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పూజారి యల్లయ్య, రాణి, డ్వాక్రా మహిళలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: న్యాయవ్యవస్థ, మహిళా చట్టాలపై అవగాహనతో మహిళల జీవితాలలో వెలుగు ప్రసరిస్తుందని ప్రముఖ న్యాయవాది బాలజ్యోతి పేర్కొన్నారు. శనివారం బి.కొత్తకోట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజిలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో జరిగిన మహిళాన్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై నేటి సమాజం లో మహిళలు ఎదుర్కొంటున్న ఈవ్‌టీజింగ్, లైంగికవేధింపులు, యాసిడ్ దాడులు, వరకట్నం, బాల్యవివాహాలు, తదితర అంశాలు వాటికి చట్టపరంగా, న్యాయపరంగా తీసుకోవాల్సిన చర్యల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీయం రాజేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్, సంఘమిత్రలు, పోలీసులు పాల్గొన్నారు.

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి

మదనపల్లె అర్బన్, అక్టోబరు5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల జనగణనను వెంటనే చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా విజయవాడలోని ధర్నా చౌక్‌లో బీసీల కులగణన చేపట్టాలని నిరసిస్తూ ఏపీ బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, బీఎస్పీ నాయకులు రమణ, బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్, లక్ష్మీపతి, సంధ్య, శివ, చ్రం, ప్రసాద్, మహేస్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక

మదనపల్లె టౌన్, అక్టోబరు 5: అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ జట్టును మదనపల్లెలో ఎంపిక చేశారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్ మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, కార్యదర్శి మురళీధర్ ఆధ్వర్యంలో క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి 35 మంది పురుషులు ఈ ఎంపిక కార్యక్రమానికి హాజరయ్యారు. వారిలో ప్రావీణ్యం కనపరచిన 22 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపిక చేసిన జట్టుకు కోచింగ్ ఇచ్చి, ఈనెల 8 నుంచి 11 వరకు గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు పంపుతామన్నారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా మహేంద్రనాయక్, కోచ్‌గా విజయ్. మేనేజర్‌గా ఉదయ్‌కుమార్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ సీనియర్ క్రీడాకారులు హరి, నరేంద్ర, అబ్దుల్లా పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి

గుర్రంకొండ, అక్టోబరు 5:గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు పని చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. శనివారం గుర్రంకొండలో ఆపార్టీ నాయకులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలపరచడానికి నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని నాయకులకు సూచించారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించండి


అదనపు గదులను పరిశీలిస్తున్న డీఈవో

కురబలకోట, అక్టోబరు 5: విద్యార్థులు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వసతులను కల్పించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల సామర్థ్యాలను వారిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాలు అత్యధికంగా సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు. మండల విద్యాకేంద్రాన్ని సందర్శించి ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదును అడిగి తెలుసుకున్నారు. .

ఆలస్యంగా నడిచిన రైళ్లు..అవస్థలు పడ్డ ప్రయాణికులు

ములకలచెరువు, అక్టోబరు 5: గుంతకల్లు జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే పలు రైళ్లు శనివారం ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సికింద్రాబాద్ జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే సెవెన్‌హిల్స్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా 4.49 గంటలకు రెండు గంటలు ఆలస్యంగా వచ్చింది. ఈ రైలు మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.19 గంటలకు వెళ్లాల్సి ఉండగా 5.19 గంటలకు, కలికిరికి 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా 5.44 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 6 గంటలకు వచ్చింది. అలాగే నరసాపూర్ నుంచి ధర్మవరం జంక్షన్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 7.49 గంటలకు వచ్చింది. ఈ రైలు గంట ఆలస్యమైంది. తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు ప్రతి రోజు రాత్రి నడిచే ప్రత్యేక చార్జీల రైలు(ప్యాసెంబర్) ములకలచెరువుకు తెల్లవారుజామున 1.49 గంటలకు రావాల్సి ఉండగా 3.19 గంటలకు వచ్చింది. ఈ రైలు కూడా 1.70 గంటలు ఆలస్యంగా నడిచింది. అలాగే ప్రతి రోజూ ఉదయం గుంతకల్లు జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే ప్యాసెంజర్ రైలు కూడా ములకలచెరువుకు ఉదయం 10.39 గంటలకు రావాల్సి ఉండగా 11.53 గంటలకు వచ్చింది. రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు గంటల తరబడిగా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

వరద ప్రభావిత మసీదులకు ఉపకరణాల వితరణ


మసీదు కమిటీ సభ్యులకు పరికరాలు అందజేస్తున్న పీలేరు జమాత్ సభ్యులు

పీలేరు, అక్టోబరు 5: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని పలు మసీదులకు పీలేరు ముస్లిం జమాత్ కమిటీ ఆధ్వర్యంలో పలు ఉపకరణాలు వితరణగా అందజేశారు. వరదల కారణంగా విజయవాడలోని పలు మసీదుల్లోని ఉపకరణాలు ధ్వంసం అవడం అందరికీ తెలిసిందే. నష్టపోయిన మసీదులకు తమ వంతు సాయం అందించాలని నడుం బిగించిన పీలేరు ముస్లిం జమాత్ కమిటీ గత నెలలో పట్టణంలోని అన్ని మసీదులలో చందాల రూపంలో రూ.లక్ష సేకరించింది. ఆ మొత్తంతో జమాత్ కమిటీ సభ్యులు ముగ్గురు శుక్రవారం విజయవాడకు వెళ్లి పీలేరు ముస్లిం జమాత్ కమిటీ తరఫున విజయవాడ సింగ్ నగర్, కండ్రిగ, రాజు నగర్, సుందరయ్య నగర్, వాంబే కాలనీ, దేవి నగర్, పీ అండ్ టీ కాలనీలోని మసీదులకు ఉపకరణాలను అందించారు. కమిటీ సభ్యులు ఇమ్దాదుల్లా, అబ్దుల్ మాలిక్, సయ్యద్ యూసుఫ్‌లను శనివారం స్థానిక జామియా మసీదులో మిగిలిన సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా జామియా మసీదు ముతవల్లి అల్లావుద్దీన్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా విరాళాలు సేకరించి మసీదులకు కావాల్సిన ఉపకరణాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్ర మంలో ముతవ ల్లీలు అస్లం, రియాజుల్లా, యాసీన్, రియాజ్, నవాబ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

వరదబాధితులకు రూ.35వేలు ఆర్థిక సాయం

బి.కొత్తకోట, అక్టోబరు 5: విజయవాడ వరదబాధితుల సహాయనిధికి బి.కొత్తకోట పట్టణంలోని ఆదిత్య కళాశాల యాజమాన్యం బాసటగా నిలిచి తమవంతుగా రూ.35వేలు ఆర్థిక సహాయం అందించింది. శనివారం జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి ఈ మేరకు చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ యల్.ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ సామాజికసేవలో భాగంగా మానవత్వంతో వరద బాధితులకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన ఆదిత్యకళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. మున్ముందు మరిన్ని సామాజిక సేవాకార్యక్రమాలు చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించినట్లు కళాశాల బృందం పేర్కొన్నారు.

15లోపు 'ఫ్రీహోల్డ్' వెరిఫికేషన్ పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రమ

పీలేరు, అక్టోబరు 5: పీలేరు మండలంలోని ఫ్రీ హోల్డ్ భూముల ఫైళ్ల పరిశీలనను ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని పీలేరు మండల ప్రత్యేక అధికారి రమ పేర్కొన్నారు. మండలంలోని ఫ్రీ హోల్డ్ భూముల అంశంపై శనివారం ఆమె తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నిర్ధేశించిన గడువు పూర్తయినప్పటికీ పీలేరు మండలంలో ఫ్రీ హోల్డ్ భూముల ఫైళ్లు పెండింగ్‌లో ఉండడం పట్ల జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆగ్రహంగా ఉన్నారని, 15వ తేదీలోపు వాటి పరిశీలన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పీలేరు మండలంలో గత ప్రభుత్వం కేవలం 2218 ఎకరాలకు మాత్రమే ఫ్రీ హోల్డ్ ప్రొసీడింగ్స్ ఇవ్వగా ఆన్‌లైన్‌లో దాదాపు 5 వేల ఎకరాలు ఫ్రీ హోల్డ్‌లో ఉన్నట్లు చూపిస్తోందన్నారు. ఈ వ్యత్యాసాలను గమనించి, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ అర్హత ఉన్న భూములనే ఫ్రీ హోల్డ్‌లో పెట్టాలన్నారు. అనంతరం పంచాయతీల వారీగా ఫైళ్లను సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వరరావు, డీటీలు సుబ్రహ్మణ్యం, రెడ్డప్ప రెడ్డి, ఇషాక్, విజయ కుమార్ రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చర్యలు తప్పవు


సమావేశంలో మాట్లాడుతున్న డీఐవో ఉషశ్రీ

పీలేరు, అక్టోబరు 5: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. పీలేరులోని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆమె ఆధ్వర్యంలో పీసీపీఎన్‌డీటీ యాక్టుపై సెన్సటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణ చేయకూడదన్నారు. అలా చేసినట్లు రుజువైతే ఆయా స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు జరిమానా, జైలు శిక్షతోపాటు కేంద్రం రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి స్కానింగ్ కేంద్రం నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లా అథారిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఏదైనా మార్పులు చేయాల్సి వస్తే విధిగా జిల్లా అథారిటీ వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్టు జిల్లా ప్రోగ్రాం అధికారి దేవశిరోమణి మాట్లాడుతూ ఇటీవల ఫారం-ఎఫ్‌లు సక్రమంగా పంపని స్కానింగ్ కేంద్రాలకు జిల్లా కలెక్టర్ రూ.40 వేల జరిమానా విధించారని వెల్లడించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ సరస్వతి, హెచ్‌ఈలు ఉషారాణి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా బోర్డు, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి

మదనపల్లె అర్బన్, అక్టోబరు5: రైతులకు టమోటా పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా టమోటా బోర్డును ఏర్పాటు చేసి తద్వారా కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు- కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు రామిశెట్టి వెంకయ్య డిమాండ్ చేశారు. స్థానిక మామిడి మండిలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ టమోటాను పండిస్తున్నా సీజన్‌కు సంబంధం లేకుండా గిట్టుబాటు ధర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్‌లైన్ పేరుతో వీర్వోలు, తహసీల్దారులు వారికి అనుకూలమైన వారిపేర్లను అన్‌లైన్ చేస్తుండడంతో నిజమైన భూ యాజమానులు నష్టపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎండపల్లె వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి సురేంద్రనాథ్, జిల్లా అధ్యక్షుడు ఉమాపతినాయుడు, ఆంజనేయులు, నారాయణ, నాగప్ప, వెంకటస్వామి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ నిర్మాణాలపై విజిలెన్స్ అధికారి విచారణ

పీలేరు, అక్టోబరు 5: పీలేరు మండలంలో హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న కాలనీ గృహాలపై శనివారం రాష్ట్ర హౌసింగ్ శాఖ విజిలెన్స్ అధికారి, రిటైర్డు డీఈ కరీముల్లా విచారణ జరిపారు. హడ్కో నిధులతో నిర్మితమవుతున్న ఆ ఇళ్లను ప్రభుత్వ నిబంధల మేరకు నిర్మిస్తున్నారా? బిల్లుల చెల్లింపు సక్రమంగా జరుగుతోందా? అసలైన లబ్ధిదారులే ఆయా ఇళ్లు నిర్మించుకుంటున్నారా? అన్న అంశాలను విచారించామని, నివేదిక రూపంలో రాష్ట్ర ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఏపీఐఐసీ-1, కంకర ఫ్యాక్టరీ, బోడుమల్లువారిపల్లె, ముడుపులవేముల, ఆయిల్ సీడ్స్ లే-ఔట్లలో విచారణ జరిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈలు రమణయ్య, బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.